PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 334 | విజయవాడ, ఆదివారం 6 జూలై 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 6 July 2025 | Rs



ఆధిపత్యం కోసమే అమెరికా జిత్తులు

- 'ద హిందూ' ఇంటర్వ్యూలో ప్రకాశ్ కరత్

7



శుభ్‌మన్ రికార్డు సెంచరీ

- ఇండియా రెండో ఇన్నింగ్స్ 427/6 డిక్లేర్డ్
- ఇంగ్లండ్ లక్ష్యం 608 పరుగులు, ప్రస్తుతం 72/3

8

4 లక్షల టన్నుల ఎరువుల కోత !

- వాడకం తగ్గిస్తే సబ్సిడీ మొత్తాన్ని బదిలీ చేస్తామంటూ ఆశ చూపిన కేంద్రం
- అంగీకరించిన టిడిపి కూటమి సర్కారు
- భారీగా 'నానో' వినియోగానికి సిద్ధం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్రాలు ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే ఆ మేరకు సబ్సిడీ అమౌంట్‌ను బదిలీ చేస్తామని, ఆ నిధులను దేనికైనా వాడుకోవచ్చని కేంద్రప్రభుత్వం సరికొత్త ఆఫర్ ఇచ్చింది. దానికి ఆంధ్రప్రదేశ్‌లోని టిడిపి కూటమి ప్రభుత్వం మారు మాట్లాడకుండా అంగీకరించింది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటం వలన కేంద్రం ఇచ్చిన ఆఫర్‌ను వినియోగించుకుంటున్నట్లు అంతర్గతంగా సమర్థించుకుంటోంది. కేంద్రం ఆదేశాలననుసరించి ఈ ఏడాదిలో సుమారు 4 లక్షల టన్నుల ఎరువుల వాడకాన్ని తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించి వ్యవసాయ, అనుబంధ శాఖలతో ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక కార్యాచరణకు దిగింది. తగ్గించే ఎరువుల్లో యూరియా ఎక్కువగా ఉంది. రాష్ట్రానికి ఏటా ఎరువుల సబ్సిడీ కింద కేంద్రం రూ.15 వేల కోట్లు భరిస్తోందని, 4 లక్షల టన్నుల వినియోగం తగ్గించినపక్షంలో దాదాపు రూ.1,500 కోట్లు రాష్ట్రానికి కేంద్రం విడుదల చేస్తుందని ఆశ పడుతోంది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన పరిశోధనలు లేకపోయినా, శాస్త్రీయంగా నిరూపితం కాకపోయినా నానో ఎరువులను రాష్ట్రానికి కేంద్రం అంటగట్టింది. గత సంవత్సరం కంటే పది రెట్లు అధికంగా ఈ ఏడాది నానో యూరియా, నానో



డిఎపి విక్రయించాలని రాష్ట్రానికి పురమాయించింది. పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని నియంత్రిస్తున్నామని మోడీ సర్కార్ చెబుతున్నా, వాస్తవానికి ఎరువుల సబ్సిడీని గణనీయంగా తగ్గించుకునేందుకే ఈ ఎత్తు వేసిందని అర్థమవుతోంది. ఇప్పటికే సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం పేరిట కేంద్రం ఎరువుల కేటాయింపులకు కోతలు పెడుతోంది. దాంతో అదనుకు రైతులకు ఎరువులు దొరకట్లేదు. ఇంకా కేటాయింపులు తగ్గిస్తే సమయానికి ఎరువులు అందుబాటులో లేక అన్నదాతలు ఇబ్బందులు పడే ప్రమాదం పొంచి ఉంది.

పది శాతం కోత

ఎరువుల తగ్గింపునకు ఒక ఫార్మూలా అమలు చేస్తున్నారు. నిరుడు ఎరువుల కేటాయింపులు, అమ్మకాలను మదించి, ఈ ఏడాది కనీసం పది శాతం వినియోగాన్ని తగ్గించేందుకు ప్లాన్ చేశారు. రాష్ట్రంలో అన్ని ఎరువులూ కలుపుకొని సాధారణ వినియోగం 39 లక్షల టన్నులు కాగా, 35 లక్షల టన్నులకు తగ్గించనున్నారు. నిరుడు యూరియా 16.10 లక్షల టన్నులు, డిఎపి, కాంప్లెక్స్‌లు కలిపి 17.2 లక్షల టన్నులు, ఎస్ఎస్‌పి, ఎంఒపిలు 3.6 లక్షల టన్నుల విక్రయాలు జరిగాయని చెబుతున్నారు. ఈ సంవత్సరం రమారమి 4 లక్షల టన్నుల వినియోగం తగ్గాలంటూ జూన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయశాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్దేశించారు. ఇప్పుడా లక్ష్య సాధనను వ్యవసాయశాఖ ఈ ఖరీఫ్ నుంచి అమల్లో పెట్టింది.

రైతులు వద్దంటున్నా సరే..

శాస్త్రీయంగా నిరూపితం కాకపోయినా సరే, నానో ఎరువుల ప్రమోషన్‌ను భుజానికెత్తుకున్న మోడీ ప్రభుత్వం ఈ సంవత్సరం భారీగా వాటి అమ్మకాలను పెంచేందుకు రాష్ట్రాలపై ఒత్తిడి పెంచింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 2.67 కోట్ల యూరియా బాటిళ్లు, కోటి డిఎపి బాటిళ్లు అమ్మాలని టార్గెట్‌గా నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌కు 2.6 లక్షల యూరియా బాటిళ్లు, 1.02 లక్షల డిఎపి బాటిళ్ల విక్రయాలను నిర్దేశించింది. నానో యూరియా ద్రవ (లిక్విడ్) రూపంలో ఉంటుంది. యూరియా 500 మిల్లీలీటర్ల బాటిల్, డిఎపి 1,000 మిల్లీలీటర్ల బాటిళ్లల్లో సరఫరా చేస్తున్నారు. యూరియా బాటిల్ ధర రూ.250 కాగా, డిఎపి బాటిల్ ధర రూ.530. రైతులు నానో ఎరువులను తిరస్కరిస్తున్నా బాటిళ్లల్లో అమ్మాల్సిందేనన్న కేంద్రం ఆదేశాలకు రాష్ట్రంలో కూటమి సర్కారు తలాడిస్తోంది. పిఎసిఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ సంస్థలలో నానో ఎరువులను రైతులకు అమ్మించేందుకు యత్నాలు సాగిస్తోంది.

7 గ్రామాల్లో 20,496 ఎకరాలు

- రెండో దశలో పూలింగుకు సిఆర్‌డిఎ అథారిటీ నిర్ణయం
- నిర్మాణాలకు కృష్ణా నది ఇసుక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని రెండోదశలో తొలివిడత 20,496 ఎకరాలు సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తుళ్లూరు, అమరావతి మండలాల పరిధిలోని ఏడు గ్రామాల్లో ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. శనివారం ఉదయం ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఎ అథారిటీ 50వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా తీసుకునే పూలింగు ఏరియా అభివృద్ధి కోసం మరో రూ.20 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. రెండోదశ పూలింగులో తుళ్లూరు మండలంలో గతంలో పూలింగుకు తీసుకోని పెదపరిమిలో 6,513.52 ఎకరాలు, వడ్డమానులో 1,936.87 ఎకరాలు, హరిశ్చంద్రాపురంలో 2,428.25 ఎకరాలు మొత్తం 10,878.64 ఎకరాలు సమీకరణ కింద తీసుకోనున్నట్లు ప్రకటించారు. అమరావతి మండలం పరిధిలోని వైకుంఠపురంలో 3,361.48, పెదమద్దూరులో 1,145.96, యండ్రాయిలో 2,166.04, కర్లపూడిలో 2,944.10 ఎకరాలు తీసుకోనున్నారు. దీనిపై వెంటనే ఆయా జిల్లాల అధికారులు సమీకరణ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఏడు గ్రామాలకు ఇప్పటికే స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను ఎంపిక చేశారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే వారిని నియమించనున్నారు. గతంలో ఉన్న అనుభవాలు, అభ్యంతరాలపై రైతులు కోర్టును ఆశ్రయించడం వంటి ఇబ్బందులు పెట్టకుండా కొత్త పూలింగు చట్టంలో సెక్షన్ 55 (2) కింద రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నట్లుగా అంగీకారపత్రం తీసుకుంటారు. దీనికోసం ఆధార్ ఆధారిత గ్యారంటీతోపాటు రిజిస్ట్రేషన్ తరహాలో ముందుగానే ఆమోదం తెలిపినట్లు వేలిముద్రలూ వేయించుకుంటారు. పూలింగు నోటిఫికేషన్ జారీ చేసినప్పటి సెక్షన్ 49 ప్రకారం రైతులు భూములు వినియోగించుకోకుండా (వ్యవసాయం) నిషేధించనున్నారు.

నాలుగు కన్వెన్షన్ సెంటర్లు

రాజధాని పరిధిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు నిర్మించే ప్రాంతంలో మందడం, తుళ్లూరు, లింగాయపాలెంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం ఒక్కో దానికి 2.50 ఎకరాల చొప్పున భూములు కేటాయించారు. అమరావతిలో జరుగుతున్న పనులకు కృష్ణానదిలో ఇసుక డ్రెడ్జింగ్ చేసుకునేందుకూ అథారిటీ అనుమతించింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక తవ్వనున్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిపై ఇ-15 రోడ్డుకు ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు విగ్రహాల ఏర్పాటుకూ స్థలం కేటాయించారు. మందడం, రాయపూడి, పిచ్చుకలపాలెంలో ఫైనాన్స్, స్పోర్ట్స్ సిటీల్లో దాదాపు 58 ఎకరాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్ఎఫ్‌పి పిలిచేందుకు ఆమోదం తెలిపారు.

పూలింగు ప్రక్రియ సాగేదిలా..

- సెక్షన్ 55(4) కింద కాంపిటెంట్ అధికారి ప్రాంతాల వారీ పూలింగు ప్రకటన చేయనున్నారు.
- కొత్తగా సమీకరించే ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ భూ సమీకరణ పథకం 2025 రూల్స్‌ను వర్తింపజేయనున్నారు.
- రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లను ఎపిసిఆర్‌డిఎ చట్టం 2014లో సెక్షన్ 43(3) కింద ఇవ్వనున్నారు.
- సెక్షన్ 48(1), 50 ప్రకారం రైతుల నుండి దరఖాస్తులు తీసుకోనున్నారు.
- పూలింగు ఏరియాలో నియమించే అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అభ్యంతరాలను తెలిపేందుకు 30 రోజులపాటు మిగతా 7లో

'సింహాచలం'లో మళ్లీ నిర్లక్ష్యం

- కూలిన రేకుల షెడ్డు
- యాత్రికులకు తప్పిన ముప్పు

7

2026 జూన్‌కు వెలిగొండ

- ప్రాధాన్యతా క్రమంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు
- నీటి లభ్యత, అవసరాలను లెక్కించేందుకు వాటర్ ఆడిట్
- జలవనరులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

2

వ్యవసాయ కార్పొరేటీకరణను నిలువరించేందుకు

ఐక్య ఉద్యమాలే ఏకైక మార్గం

- ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు అశ్రమారామ్

6

గాజా కోసం మౌనం

- ప్రపంచ వ్యాప్త నిరసన
- భాగస్వామ్యం కావాలని సిపిఎం పిలుపు

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులకు నిత్యం రక్తమోడుతున్న గాజాకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్త నిరసనోద్యమ పిలుపునకు విశేష మద్దతు లభిస్తుంది. 'గాజా కోసం మౌనం' (సైలెన్స్ ఫర్ గాజా) పేరిట నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ డిజిటల్ నిరసన కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కూడా భాగస్వామ్యమైంది. ఇందులో భాగంగా ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి 9.30 గంటల వరకు ఒక అరగంట పాటు ప్రజలందరూ తమ ఫోన్లను స్విచ్చాఫ్ చేసి నిరసన తెలియజేయనున్నారు. ఈ కార్యక్రమంలో దేశ ప్రజలందరూ పాల్గొని గాజాకు సంఘీభావం తెలియజేయాలని సిపిఎం పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఐక్యరాజ్యసమితి 'ఆక్యుపేషన్ ఎకానమీ టు ఎకానమీ ఆఫ్ జెనోసైడ్' పేరిట ఇటీవల విడుదల చేసిన నివేదికలో గాజాపై ఇజ్రాయెల్ దాడిలో వివిధ బహుళజాతి సంస్థలు ఎలా భాగస్వాములయ్యాయో వివరించిదని సిపిఎం పేర్కొంది. రక్తమంటిన ఈ సంస్థల నిజస్వరూపాన్ని బహిర్గతం చేసి..ప్రజలకు జవాబుదారీగా చేయాల్సిన అవసరముందని తెలిపింది. ఇజ్రాయిల్‌తో కలిసి మారణకాండలో భాగస్వామ్యమైన ఈ కార్పొరేట్ సంస్థలు మన డిజిటల్ వేదికలను సైతం తమ దుర్మార్గమైన ఎత్తుగడులకు వాడుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. నిర్ణీత సమయంలో ప్రతిరోజూ అరగంట పాటు మా మొబైల్ ఫోన్‌లను ఆపివేయడం అనే డిజిటల్ అంతరాయం చిన్న విషయమే అయినా వాస్తవానికి ఇది చాలా శక్తివంతమైన చర్య అని సిపిఎం పేర్కొంది. ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధానికి,. జాతి వివక్ష జాడ్యానికి మద్దతిస్తున్న నిఘా పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఇదొక సమ్మె రూపమని పేర్కొంది. ఈ డిజిటల్ నిరసనోద్యమంలో దేశ ప్రజలంతా చురుకుగా పాల్గొని, ఇజ్రాయిల్ మారణకాండకు వ్యతిరేకత తెలియాలని కోరింది. నిరసన సమయంలో మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయాలని, అలాగే ఆ సమయంలో అన్ని రకాల సామాజిక మాధ్యమాలను వినియోగించడం ఆపేయాలని, అంటే పోస్టులు పెట్టడం, లైక్ చేయడం, లేదా వాటిని ఇతరులకు పంపడం వంటి చర్యలు చేయవద్దని సూచించింది. ఇలా చేస్తే ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఉంటోన్న కార్పొరేట్ సంస్థలు డిజిటల్‌గా దిగ్బంధనానికి గురౌతాయని తెలిపింది. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు సాగిస్తున్న నేపథ్యంలో ఆ దాడులకు బలైపోతున్న పాలస్తీనీయన్లకు సిపిఎం సంఘీభావంగా నిలుస్తోందని తెలిపింది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్త 'సైలెన్స్ ఫర్ గాజా' డిజిటల్ నిరసనోద్యమంలో పాల్గొంటున్నట్లు పేర్కొంది. ఈ సామూహిక నిశ్శబ్దమే యుద్ధ నేరాలకు వ్యతిరేకంగా శక్తివంతమైన గళంగా మారుతుందని తెలిపింది.

అమెరికాలో నీరవ్ మోడి సోదరుడి అరెస్ట్



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.13 వేల కోట్లకు పైగా ముంచిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడి చిన్న సోదరుడు నేహల్ మోడీని అమెరికా అధికా రులు అరెస్ట్ చేశారు. భారత్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) నుండి వచ్చిన ఎక్స్‌ట్రాడిషన్ అభ్యర్థనల ఆధారంగా నేహల్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా అధికారులు తెలిపారు. 46 సంవత్సరాల నేహల్ మోడి పిఎన్‌బి మోసం కేసులో తీవ్ర ఆరోపణలను ఎదుర్కొంటు న్నాడు. ఈ కుంభకోణంలో నీరవ్ మోడి, నేహల్ మోడి, వాళ్ల మామ మెహుల్ చోక్సీలు కీలక పాత్రదారులుగా ఉన్నారు. వీరు మనీలాండరింగ్, క్రిమినల్ కుట్ర, సాక్ష్యాలను అదృశ్యం చేయడం వంటి క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. తాజాగా నేహల్ మోడీని ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు ఆధారంగా అరెస్టు చేశారు.

గోదావరికి వరద ఉధృతి

- సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న ముంపు బాధితులు

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి నీటి ప్రవాహం పెరుగుతుండడంతో పోలవరం నిర్వాసితుల్లో మళ్లీ భయాందోళన మొదలైంది. ఎగువున కురుస్తోన్న వర్షాలకు వాగులు, ఉపనదులు పొంగి గోదావరిలో వరద ఉధృతి పెరగడం వారిని కలవరపరుస్తోంది. శనివారానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 20 అడుగులకు చేరుకుంది. ఒక్క రోజు వ్యవధిలో సుమారు ఐదు అడుగుల మేర వరద పెరగడంతో ముంపు ప్రభావిత ప్రాంతాల వాసులు భీతిల్లుతున్నారు. ప్రస్తుతానికి భయపడే పరిస్థితి లేదని, వరద ముంపును ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందొద్దని అల్లూరి జిల్లా ఎటపాక తహశీల్దార్ కె.సుబ్బారావు తెలిపారు. శబరి, గోదావరి నదులు కలిసే విఆర్.పురంలోని ఒడ్డుగూడెం వాసులు గత సంఘటనలను గుర్తుచేసుకుంటున్నారు. ఒడ్డుగూడెం కాలనీ, ధర్మతాలగూడెం, శ్రీరామగిరి, చింతరేగుపల్లివాసులదీ ఇదే పరిస్థితి. ఇప్పటికే ముంపు ప్రభావిత ప్రాంతాల వారు కొండలు, గుట్టలపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాకలు వేసుకుంటున్నారు.



సురక్షిత ప్రాంతాలకు సామాన్లు తీసుకుని వెళ్తున్న అల్లూరి జిల్లా కూనవరం వాసులు

ప్రభుత్వం తక్షణమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, నిత్యావసరాలను అందించాలని వారు కోరుతున్నారు. కూనవరం, టేకులబోరు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడం మొదలెట్టారు. ముంపులేని గ్రామాల్లో మూడు నెలలపాటు అద్దెకు ఇళ్లు తీసుకున్నారు. శనివారం అక్కడకు ట్రాక్టర్లపై సామాన్లు తరలిస్తూ కనిపించారు. చింతూరులో ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు లోతట్టు ప్రాంతవాసులను అప్రమత్తం చేశారు. దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయంలోకి గోదావరి వరద నీరు క్రమేపీ పెరుగుతోంది.

మరో మూడు రోజులు వరద ఉధృతి

కొవ్వూరు గోష్పాద క్షేత్రం స్థానఘట్టాల వద్ద వరద ఉధతంగా ప్రవహిస్తోంది. ఎగువన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి శుక్రవారం 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. ఈ నీరు దిగువన ధవళేశ్వరం ఆనకట్టకు చేరుకోవడానికి మిగతా 7లో

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల

సర్దుబాటు

- కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు చేశారంటూ ఆవేదన

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ మిగులు ఉద్యోగులను సర్దుబాటు చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియను జూన్ 30లోగా పూర్తి చేయాలని తొలుత భావించినప్పటికీ పింఛన్ల పంపిణీ నేపథ్యంలో ఈ గడువును శనివారం వరకు ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగులు ఉద్యోగులను వారి విద్యార్హతలను బట్టి, ప్రభుత్వానికి ఏ విభాగంలో అవసరమైతే ఆయా విభాగాలకు డిప్యుటేషన్ వేస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఎపి ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ (4.0), 2024-29ని ప్రారంభించింది. వినూత్న స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇలకు మద్దతు ఇవ్వడానికి అమరావతి కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను (ఆర్‌టిఐహెచ్) త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు సెక్రటేరియట్ల ఫంక్షనరీలను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. సెంట్రల్ హబ్‌లో 30 మంది ఉద్యోగులను నియమించనున్నారు. వీటితోపాటు అదనంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు జిల్లాల రీజనల్ కేంద్రాలుగా విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్‌టిఆర్, తిరుపతి, అనంతపురంలలో ఒక్కో జిల్లాకు 20 మంది చొప్పున సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ జిఓఆర్‌టి నెంబరు 11ను శనివారం విడుదల చేసింది. ఇందులో సిఇఒ డెస్క్ కింద 26 మందిని నియమించనున్నారు. మిగిలిన సిబ్బందితో కలిపి మొత్తం 130 మందిని హబ్‌లకు డిప్యుటేషన్ మీద పంపనున్నారు. ఉద్యోగులను ఎంపిక చేసి పంపే బాధ్యతలను ఆయా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం అప్పజెప్పింది. ప్రాధాన్యతా క్రమంలో ఎంబిఎ (ఫైనాన్స్) ఎమ్‌కామ్, సిఎ చదువుకున్న ఉద్యోగులు ముందు వరుసలో ఉండను న్నారు. వీరి తర్వాత ప్రాధాన్యతలో ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్/గ్రాడ్యుయేట్ (సైన్స్) ఉన్న వారిని హబ్‌లలో పనిచేసేందుకు సూచించాలని ప్రభుత్వం పేర్కొంది. ఆయా ఉద్యోగులకు జీతభత్యాలు గ్రామ, వార్డు సచివాలయశాఖ చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇది ఇలా ఉంటే శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు టౌన్‌లో విఆర్ హైస్కూల్‌కు బిఇడి చేసిన సచివాలయ ఉద్యోగుల్లో నుంచి 18 మందిని నియమించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో 10 మంది శానిటేషన్ సెక్రటరీలు, ముగ్గురు ఎడ్యుకేషన్ సెక్రటరీలు, ఇద్దరు వెల్ఫేర్ సెక్రటరీలు, ఇద్దరు మహిళా పోలీసులు, ప్లానింగ్, అడ్మిన్ సెక్రటరీలు ఒక్కొక్కరినీ డిప్యుటేషన్ బేసిక్‌పై కేటాయించారు.

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలంటూ ఉద్యోగుల ఆవేదన

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలంటూ శనివారం విజయవాడ, విశాఖ, అనంతపురం, అన్నమయ్య, ఏలూరు జిల్లాల్లో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద, మచిలీపట్నంలో జిల్లా ఎస్‌పి కార్యాలయం వద్ద ఉద్యోగులు తమ నిరసన వ్యక్తం చేశారు. విజయవాడ మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు నేలమీద కూర్చొని నిరసన తెలిపారు. కొన్ని శాఖలకు కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు, మరికొన్ని శాఖలకు కౌన్సెలింగ్ నిర్వహించకపోవడమేంటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇది ఇలా ఉంటే విఎంసి పరిధిలోని 146 సచివాలయంలో అడ్మిన్‌గా పనిచేస్తున్న తేళ్ల భాస్కరరావు గత నెల 14న మృతి చెందారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఆయనను అదే సచివాలయంలో అడ్మిన్‌గా పోస్టింగ్ ఇవ్వడం బదిలీల ప్రక్రియ ఎంత లోపభూయిష్టంగా జరిగిందో ఇట్టే అర్థమవుతోంది.

సంపన్నులకు ట్రంప్ నజరానా

- బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై సంతకం
- 1.18 కోట్ల మంది ఆరోగ్య బీమాకు కత్తెర

వాషింగ్టన్ : బడా పెట్టుబడిదారులకు విధించే పన్నుల్లో భారీ మినహాయింపులు, సామాజిక పథకాలకు జరిపే కేటాయింపులపై భారీ కోతలు విధిస్తూ అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకువచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లు చట్టంగా మారింది. ఈ బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం మధ్యాహ్నం వైట్‌హౌస్‌లో సంతకం చేశారు. ఒక పక్క దేశం స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ అతిపెద్దదైన దేశీయ విధాన బిల్లు చట్టరూపం దాల్చడం ప్రధాన రాజకీయ విజయంగా ట్రంప్ భావిస్తున్నారు. అనంతరం వైట్‌హౌస్ బాల్కనీలో భార్య మెలానియాతో కలిసి నిలబడిన ట్రంప్ ప్రసంగించారు. 'ప్రజలంతా సంతోషంగా వున్నారని అన్నారు. ప్రభుత్వ వ్యయంలో అతిపెద్ద కోత ఇదని, ఇంతవరకు దేశ చరిత్రలోనే ఇటువంటిది ఎన్నడూ చూసివుండరు' అని ట్రంప్ అన్నారు. అయితే సంపన్నులకు పన్నుల్లో రాయితీలు ఇవ్వడాన్ని గొప్పగా చెప్పుకున్న ఆయన సామాజిక పథకాల మిగతా 7లో

ఫ్రీ హోల్డ్ భూములపై ఇచ్చిన ఆదేశాలతో పేదలకు అన్యాయం

- అఖిలపక్ష సమావేశం జరిపి సమగ్ర విధానం రూపొందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిషేధిత, ఫ్రీ హోల్డ్ భూములపై ఇచ్చిన ఆదేశాలు టిడిపి ఎన్నికల హామీలకు భిన్నంగా పేదలకు అన్యాయం జరిగే విధంగా ఉన్నాయని సిపిఎం కమిటీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదల భూములను పెత్తందార్లకు, కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా చర్యలు ఉన్నాయని, తక్షణమే అఖిలపక్ష సమావేశం జరిపి భూ సమస్యపై సమగ్ర విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితా నుంచి తప్పించిన ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అక్టోబర్ రెండోతేదీ నాటికి సమగ్రమైన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు ప్రకటించారని, ఈలోగా అన్ని రాజకీయ పార్టీలు, భూ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులు, వ్యవసాయ కార్మిక సంఘాలతో భూ కమిటీలను నియమించి సమగ్రంగా చర్చించి నిజమైన పేదలకు, సన్న, చిన్నకారు రైతులకు న్యాయం చేకూర్చేలా ముందుకెళ్లాలని కోరారు. 1970 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లాల్లో సుమారు 32 లక్షల ఎకరాల మిగులు భూములను పేదలకు పంచినట్లు ప్రభుత్వాలు తెలియజేశాయని, ఇందులో సుమారు 15 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమై పెద్దల చేతుల్లో ఉన్నట్లు గత ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమంగా అనర్హుల ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకొని నిజమైన లబ్ధిదారులకు ఇస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. దీనికోసం 40 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరిపి భూములను గుర్తించి గ్రామసభల్లో బహిర్గతం చేస్తామని ఈ ప్రభుత్వం అధికారికంగా మెమో విడుదల చేసింది. రెవెన్యూ సదస్సులు జరిగినప్పటికీ ఇప్పటి వరకు ఆ జాబితాను బహిరంగ పర్చలేదని, అనర్హుల నుండి ఒక ఎకరం బయటికి తీసి భూములు కోల్పోయిన పేదలకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను నిజమైన అర్హులకు ఇవ్వాలని కోరారు. ఐదెకరాల్లోపు మెట్ట లేదా 2.5 ఎకరాల్లోపు మాగాణి భూములు మిగతా 7లో

2026 జూన్‌కు వెలిగొండ

- ప్రాధాన్యతా క్రమంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు
- నీటి లభ్యత, అవసరాలను లెక్కించేందుకు వాటర్ ఆడిట్
- జలవనరులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులను 2026 జూన్ నాటికి పూర్తి చేసి నీళ్లివ్వాలని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది నీటి ప్రవాహాలు ఆశాజనకంగా ఉన్నాయని, అత్యుత్తమ నీటి నిర్వహణ ద్వారా ప్రతిచుక్కా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు వేగం పెంచి ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. జలవనరులశాఖపై ఉండవల్లిలోని ఆయన నివాసంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు నిర్దేశించిన సమయంలోపు పనులను పూర్తిచేయాలన్నారు. తారక రామతీర్థ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తిచేయాలని, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేయాలని అన్నారు. వంశధార-నాగావళి అనుసంధానంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వీటికి అనుసంధానించేలా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. భూగర్భ జలాల పెంపుపై మరింత శ్రద్ధ తీసుకోవాలని, ఈ అంశంలో ఇరిగేషన్ శాఖతోపాటు పంచాయతీరాజ్‌శాఖను కూడా భాగస్వామిని చేయాలని సిఎం సూచించారు.


జలవనరుల శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

15 లోగా హంద్రీ నీవా సుజల స్రవంతి ఫేజ్-1 పనులు పూర్తి

ఈ నెల 15వ తేదీలోగా హంద్రీనీవా సుజల స్రవంతి ఫేజ్-1 పనులు పూర్తి చేసి మెయిన్ కెనాల్ ద్వారా జీడిపల్లి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం మేరకు 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని సిఎం ఆదేశించారు. జీడిపల్లి నుంచి గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లను ఈ నీటితో నింపాలన్నారు. ఫేజ్-2 కాలువ ద్వారా పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు జులై 31న నీటిని విడుదల చేయాలని అధికారులకు సిఎం సూచించారు. కాలువ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా తొలిసారిగా రాయలసీమలోని వివిధ ప్రాంతాలకు నీరందనుందన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 15 రోజుల పాటు పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించనున్నారు. హంద్రీనీవా కాలువల ద్వారా విడుదలయ్యే 3,850 క్యూసెక్కుల నీటిని వినియోగించి రాయలసీమలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులను నింపాలని అధికారులను సిఎం ఆదేశించారు.

నీటి వాడకంపై వాటర్ ఆడిటింగ్

రాష్ట్రంలో కురిసే వర్షపాతం, నదుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో, భూగర్భ జలాలు, సాగు, తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని లెక్కించి పక్కాగా వాటర్ ఆడిటింగ్ చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. వాటర్ ల్యాబ్స్ ద్వారా నీటి ఆడిటింగ్ చేపట్టాలని, సమర్థవంతంగా వినియోగం కోసం అవసరమైన ప్రణాళికలు అమలు చేయాలన్నారు. పనిచేయకుండా ఉన్న పీజోమీటర్లు, వాటర్ లెవెల్ తెలిపే సెన్సార్ సిస్టమ్, రెయిన్‌గేజ్ స్టేషన్స్‌ను అందుబాటులోకి తేవాలన్నారు. భూగర్భ జల మట్టాలను కనిష్టం 3 మీటర్లు, గరిష్టం 8 మీటర్లు లక్ష్యాన్ని సాధించేలా జలవనరులశాఖ పనిచేయాలని సిఎం పేర్కొన్నారు. పూడిక తీత పనులు, చెరువుల నింపడం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం వంటి చర్యల ద్వారా భూగర్భ జలాల పెంపు లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

భూముల పందేరంపై అధికార పార్టీలోనే అసంతృప్తి

- ప్రతిపక్షంలో వ్యతిరేకించిన విధానాలే అమలని అసహనం
- ఇండోసోల్‌కు ఎలా కట్టబెడతారని ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భూ పందేరంపై సామాన్య ప్రజలు, ప్రతిపక్ష పార్టీలతో పాటు అధికార పార్టీల్లో కూడా వ్యతిరేకత నెలకొంది. ప్రతిపక్షంలో భూముల కేటాయింపును వ్యతిరేకించామని, ఇప్పుడు అదే విధానాన్ని మన ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని ఆ పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అది కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బినామీ అని ప్రచారం చేసిన షిర్డీసాయి, ఇండోసోల్ కంపెనీలకు భూములు కట్టబెట్టడంపై అధికార పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కార్పొరేట్ కంపెనీల నుంచి ప్రతిపాదనలు వచ్చిన వెంటనే ఆగమేఘాల మీద ప్రభుత్వం భూములు అప్పగించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పెట్టుబడుల పేరుతో ఇష్టానుసారం కార్పొరేట్లకు అప్పగిస్తున్న ఈ విధానంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి తీవ్రమౌతోంది. ఇప్పటికే అదాని, షిర్డీసాయి, ఇండోసోలార్ వంటి కంపెనీలకు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో ఇండోసోల్ కంపెనీకి సుమారు 8,458 ఎకరాల భూములు అప్పగించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై అధికార పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గత వైసిపి ప్రభుత్వం ఇదే కంపెనీకి రామాయపట్నం పోర్టు వద్ద 8,348 ఎకరాల భూమిని కేటాయించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి భూముల కేటాయింపును తీవ్రంగా విమర్శించింది. ఇండోసోల్ కంపెనీ జగన్ బీనామీ అంటూ ఆ పార్టీ నేతలతో ప్రెస్‌మీట్లు పెట్టి మరీ టిడిపి తీవ్రంగా విమర్శలు చేసింది. ఆ పార్టీలో కీలక నేతగా ఉన్న నారా లోకేష్ సైతం ఫేక్ కంపెనీ అంటూ విమర్శించారు. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్, ఇండోసోల్ కంపెనీ రెండు ఒక్కరివేనని, ఈ రెండు జగన్ బినామీ అని టిడిపి పేర్కొంది. అయితే 2024 జనవరి నుంచే ఈ కంపెనీపై టిడిపి తన విధానాన్ని మార్చుకుంది. ఎలక్ట్రోల్ బాండ్ల రూపంలో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ టిడిపికి రూ.40 కోట్ల ఫండ్ అధికారికంగా జనవరిలో ఇచ్చింది. అప్పటి నుంచి ఈ కంపెనీని టిడిపి పల్లెత్తి మాట కూడా అనడం లేదు. ఇప్పుడు కూడా ఇంత పెద్దమొత్తంలో వేల ఎకరాలు భూములు కట్టబెట్టడం వెనుక కంపెనీకి, పార్టీకి ఆర్థిక ఒప్పందాలు ఏమైనా జరిగాయా? అనే అనుమానాలు ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతున్నాయి. కరేడులో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం నుంచి ఎందుకు స్పందన రావడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క అమరావతిలో బ్యాడ్మింటన్ పుల్లెల గోపిచంద్, క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్‌కు అకాడమీల కోసం చెరొక 12 ఎకరాల చొప్పున భూములను కేటాయించేందుకు సిఆర్‌డిఎ సమావేశంలో శనివారం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. గోపిచంద్ అకాడమీకి హైదరాబాద్‌లో ఉమ్మడి రాష్ట్రంలో 5 ఎకరాలే కేటాయించింది. ఇందులో కేవలం 2.5 ఎకరాల్లోనే అకాడమీ ఉంది. మిగిలిన 2.5 ఎకరాలు ఖాళీగా ఉంది. ఉన్నచోటే పూర్తిస్థాయిలో స్థాపించని అకాడమికీ అమరావతిలో 12 ఎకరాలు కేటాయించడం ఎందుకని అధికార పార్టీలోనే అసంతృప్తి నెలకొంది. ఎంఎస్‌కె ప్రసాద్ అకాడమీ కూడా హైదరాబాద్‌లో తక్కువ భూమి అప్పగించారని, అమరావతిలో మాత్రం ఎక్కువ అప్పగిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. భూముల జోలికెళ్తే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెగా పిటిఎంలో విట్‌నెస్ సంతకం

- 17 కమిటీల ఏర్పాటు
- సమగ్రశిక్ష నిబంధనలతో ఉపాధ్యాయుల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం) నిర్వహణపై విధించిన నిబంధన ఉపాధ్యాయుల్లో ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ సమావేశం నిర్వహణ సమయంలో విట్‌నెస్ (సాక్షి)గా ఒక అధికారిని ఉంచాలని, అదేవిధంగా 17 రకాల కమిటీలు నియమించాలని సమగ్రశిక్ష విడుదల చేసిన ఉత్తర్వులపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిటిఎం నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నిర్వహణకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను సమగ్రశిక్ష డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. లీప్ యాప్‌లో విట్‌నెస్ అధికారి ఐడి, ఇతర వివరాలు ముందుగానే నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సమావేశం నిర్వహించే సమయంలో అధికారితో మాట్లాడి వీడియో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీంతోపాటు ఈ సమావేశం నిర్వహణ కోసం 17 రకాల కమిటీలు ఏర్పాటు చేయాలని, ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. సమగ్ర శిక్ష విధించిన ఈ నిబంధనపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఒకపక్క పాఠశాలలు తెరిచిన నాటి నుంచి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆగ్రహిస్తున్నాయి. విద్యార్థుల నమోదు కోసం ఇంటింటికీ ఉపాధ్యాయులు తిరుగుతున్నారని, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ అందిస్తున్నారని, విద్యార్థుల నమోదు వంటి పనులతో బోధనకు దూరమయ్యారని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు కమిటీలు, సాక్షి సంతకాల కోసం ఇతర శాఖల ఉద్యోగులు అంటూ బోధనకు మరింత దూరం చేస్తున్నాయన్నారు. కమిటీలు ఏర్పాటు చేసి కరపత్రాలు పంపిణీ చేయాలని, విట్‌నెస్ అధికారిని చూసుకోవడం నిబంధనలను తొలగించాలని ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర శాఖల అధికారులను సాక్షిగా నియమించుకోవాలనే నిబంధనలను తక్షణమే తొలగించాలని ఎపిటిఎఫ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. పాఠశాల అభివృద్ధి కోసం పేరెంట్ మీటింగ్స్ పెట్టి నిర్వహించే సమర్థత తమకు ఉందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు తెరిచిన నాటి నుంచి బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు అప్పచెప్పారని, ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ తెలిపింది. ఇప్పుడు సాక్షి కోసం ప్రధానోపాధ్యాయులు ఎవరిని బతిమలాడాలని ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు మరో ప్రకటనలో పేర్కొన్నారు.

గిన్నీస్ బుక్ రికార్డు కోసమే : డైరెక్టర్

మెగా పిటిఎంను గిన్నీస్ బుక్ రికార్డుల్లో నమోదు చేయించేందుకు ఒక మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నామని సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిన్నీస్ రికార్డుల నమోదు బృందం ఇచ్చిన సూచనల మేరకు విద్యాశాఖ, టీచర్, తల్లిదండ్రులు కాకుండా అదే పాఠశాల పరిధిలో ఒక బాధ్యతాయుతమైన వ్యక్తిని రిజిస్ట్రేషన్‌కు సాక్ష్యంగా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అంటే సర్పంచ్, ఎంపిటిసి, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, దాత, పూర్వ విద్యార్థి ఎవరైనా ఉండొచ్చని, ప్రభుత్వ ఉద్యోగి కాకూడదని వివరించారు. లీప్ యాప్‌లో మెగా పిటిఎం 2.0 రిజిస్ట్రేషన్‌లో వ్యక్తి విట్‌నెస్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. డిసెంబర్ 7న నిర్వహించిన మెగా పిటిఎంలో కోటికిపైగా పాల్గొన్నారన్నారు. జులై 10న నిర్వహించబోయే సమావేశంలో 2.28 కోట్ల మందికి పైగా పాల్గొని గిన్నీస్ రికార్డు నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నామని ప్రకటించారు.

'కరేడు' భూసేకరణను ఉపసంహరించుకోవాలి

- వామపక్షాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామ భూసేకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని బాలాజీ నగర్ సిపిఎం కార్యాలయంలో వారు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఇండోసోల్ పరిశ్రమ కోసం ఇటీవల ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చిందని, బడా కంపెనీల కోసం రైతుల కడుపు కొట్టి, తక్కువ ధరలకు భూములను ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు.

ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత వామపక్షాల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించామని, సోలార్ పరిశ్రమను ఆయా గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. సోలార్ పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ... కరేడు ప్రజలు, రైతులు నూటికి నూరు శాతం సోలార్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రజలు, రైతుల ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా భూసేకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మాల్యాద్రి, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

13 మంది వైద్య విద్యార్థుల సస్పెన్షన్

- ఎయిమ్స్‌లో ర్యాగింగ్‌పై అధికారుల చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

మంగళగిరి ఎయిమ్స్‌లో ర్యాగింగ్‌కు పాల్పడిన 13 మంది సీనియర్ వైద్య విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు ఎయిమ్స్ మీడియా అధికార ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 22న ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో తిరుపతికి చెందిన ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని సీనియర్లైన అతని రూమ్‌మేట్స్ ర్యాగింగ్ చేశారు. ఇది తట్టుకోలేక బాధిత విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశారు. బాధిత విద్యార్థి ఫిర్యాదు మేరకు యాంటీ ర్యాగింగ్ కమిటీ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టింది. ర్యాగింగ్‌కు పాల్పడిన 13 మంది విద్యార్థులపై యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఒకరిని ఏడాదిన్నర, నలుగురిని ఆరు నెలలు, మిలిగిన వారిని రెండు నెలలపాటు సస్పెండ్ చేసింది. ర్యాగింగ్ ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని వంశీకృష్ణారెడ్డి తెలిపారు. గతనెల 24న 15 మందిని సస్పెండ్ చేసినా.. పూర్తి విచారణ అనంతరం ఇద్దరికి మినహాయింపు ఇచ్చామని చెప్పారు.


కెవిబిపురం ఎంఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

విలీనం వద్దు.. మా బడే ముద్దు

- కెవిబిపురం, సత్యవేడు, నాయుడుపేటలో ఎంఇఒ కార్యాలయాల ముట్టడి

ప్రజాశక్తి - కెవిబిపురం, సత్యవేడు, నాయుడుపేట

మా ఊరి బడి మాకే కావాలంటూ తిరుపతి జిల్లా కెవిబిపురం, సత్యవేడు, నాయుడుపేటలో మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చేపట్టారు. ఎస్ఎల్‌పురం, మహాదేవిపురం, గురుకులకండ్రిగ, అప్పనగుంట, బంగారంకండ్రిగ, జ్ఞానమాకండ్రిగ, తిమ్మసముద్రం, ఎగువపూడి హెచ్‌డబ్ల్యు, పాత పాల్యం, ఒహత్తూరు ఎస్‌సి కాలనీ, సరస్వతీపురం గ్రామాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు కెవిబిపురం మండల విద్యాశాఖ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. వాగులు, వంకలు, శ్మశానవాటికలు, జాతీయ రహదారుల మీదుగా తమ పిల్లలను మరో పాఠశాలకు పంపించలేమని, మా ఊరిలోనే పాఠశాలను కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి జనార్దన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ.... తల్లిదండ్రులు, విద్యాకమిటీల నుంచి దొంగ సంతకాలు చేయించి పాఠశాలల విలీనానికి ఒప్పుకున్నారని తప్పుడు నివేదికలు పంపి పాఠశాలలు విలీనం చేయడం దుర్మార్గమన్నారు. 44 పాఠశాలలను మూసివేసి, 25 మోడల్ పాఠశాలలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ చర్య వల్ల విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నాయుడుపేటలో సిఐటియు నాయకులు శివకవి ముకుంద ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. చంద్రబాబునాయుడు నగర్ ఏర్పడ్డాక కాలనీ పిల్లల కోసం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారని, విలీనం పేరుతో మూసివేసి, రెండు కిలోమీటర్ల దూరంలోని తుమ్మూరుకు పంపాలనడం దుర్మార్గమన్నారు. గ్రామస్తులు విలీనం వద్దంటున్నా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. సత్యవేడులోని మదనంబేడు పాఠశాలలో పేరడం గ్రామంలో గిరిజన, దళిత బలహీన వర్గాలకు చెందిన 20 మంది విద్యార్థులను బలవంతంగా మదనంబేడు పాఠశాలకు తరలించాలని చూడటం తగదన్నారు.

టిడిపి కార్యకర్తకు సిఎం పరామర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేన్సర్‌తో బాధపడుతున్న పార్టీ కార్యకర్త అభిమతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీర్చారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం, మోరంపూడి జంక్షన్‌కు చెందిన టిడిపి అభిమాని ఆకుల కృష్ణ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. తన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో చంద్రబాబుతో ఒక్కసారైనా మాట్లాడాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న సిఎం చంద్రబాబు శనివారం స్వయంగా ఆకుల కృష్ణకు వీడియో కాల్ చేసి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా తాను ఉంటానని కృష్ణకు, అతని కుటుంబానికి భరోసా ఇచ్చారు.

అల్లర్లు సృష్టిస్తోన్న కూటమి నేతలు

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లాలో మన్నవ గ్రామ సర్పంచ్‌పై దాడి సరికాదని, అక్కడ వైసిపి బలాన్ని జీర్ణించుకోలేక కూటమి నేతలు అల్లర్లు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దాడులు, దౌర్జన్యాలతో పాలన సాగుతోందని, జనసేనను పవన్ అద్దెకిచ్చే టెంట్ హౌస్‌లా మార్చేశారని ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్ అండతో రాష్ట్రంలో కొందరు రెచ్చిపోతున్నారని, అరాచకం సృష్టిస్తున్నారని అన్నారు. టిడిపి నాయకుల అక్రమాలపై నాగమల్లేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, దీంతో వారు దాడిచేసి కొట్టారని అన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. తాడేపల్లి వైసిపి కార్యాలయంలో జరిగిన ఎస్‌సి సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడులనూ నివారించేందుకు పోరాడతామని వివరించారు. అన్ని జిల్లాల్లోనూ కమిటీలను ఏర్పాటు చేసి బలోపేతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎస్‌సి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్నవారికి

పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి పూర్తిచేసుకున్న మన రాష్ట్ర వైద్య విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. పిఆర్ నెంబరు కోసం వైద్య విద్యార్థులు గత కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వి శ్రీనివాసరావు శనివారం లేఖ రాశారు.

విదేశాల్లో ఎంబిబిఎస్ యూజీ డిగ్రీ పూర్తిచేసుకున్న వైద్య విద్యార్థులు పిజి చేయాలన్నా, వైద్య వృత్తిలో స్థిరపడాలన్నా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) నిబంధనల ప్రకారం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ అవసరమని తెలిపారు. ఈ ప్రక్రియ ఎపి మెడికల్ కౌన్సిల్ పొరపాటు వైఖరి కారణంగా ఈ సంవత్సరం దారితప్పిందని, వైద్య విద్యార్థులను సంక్షోభంలోకి నెట్టిందని తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో సుమారు 1,500 మందికి పైగా జూనియర్ డాక్టర్లు విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసుకొని ఎన్ఎంసి పెట్టిన స్క్రీనింగ్ టెస్ట్ పాసై ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకొని 13 నెలలుగా మెడికల్ కౌన్సిల్ చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. అధికారులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వకుండా మరో సంవత్సరం లేదా రెండు సంవత్సరాలు పొడిగించారని, ఈ పొడిగింపులో ఎటువంటి పద్ధతీ పాటించలేదని పేర్కొన్నారు. వారి ఆదేశాలు హేతువిరుద్ధంగా ఉన్నాయని, దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వివరించారు. శాంతియుతంగా తమ న్యాయమైన సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు బలప్రయోగం చేసి హడలెత్తించారని, ఆడపిల్లలని కూడా చూడకుండా చావబాదారని వివరించారు. ప్రజలకు సేవ చేయాల్సిన డాక్టర్లు ఈరోజు రోడ్లపై నిరసనలు చేయాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయంలో వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని వైద్య శాఖ అధికారులు, ఎపి మెడికల్ కౌన్సిల్ అధికారులతో మాట్లాడి విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.


వైద్య విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తదితరులు

వైద్య విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం

విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకొని డాక్టర్లుగా తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేయకుండా ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా గత ఆరు రోజులుగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల దీక్షా శిబిరానికి వెళ్లి వారితో కలిసి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆందోళనకు పూర్తి మద్దతును ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. వెంటనే వారందరికీ శాశ్వత రిజిస్ట్రేషన్‌పై సంతకం చేసి న్యాయం చేయాలని కోరారు.

హైడ్రో ప్రాజెక్టుల కోసం రాజ్యాంగ ఉల్లంఘన

- ప్రతిపాదనలు విరమించకపోతే ఉద్యమం తప్పదు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

గిరిజన చట్టాలను విస్మరించి, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి అల్లూరి మన్యం ప్రాంతాన్ని అదాని ఏజెన్సీగా ప్రధాని మోడీ మారుస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. అల్లూరి జిల్లా పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం పెద్దకోట, జీనబాడు, గుజ్జలి, చిట్టెంపాడు ప్రాంతాల్లో ఏడు వేల ఎకరాల భూమిని సమీకరించి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతం ఐదో షెడ్యూల్ పరిధిలో ఉందని, ప్రాజెక్టులు పెట్టేందుకు గ్రామ సభలు నిర్వహించి, పీసా చట్టం ప్రకారం అనుమతి పొందాల్సి ఉందని తెలిపారు. 1997 సమతా జడ్జిమెంట్‌లో కూడా ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. కనీసం ఈ ప్రాంత ఎంపి, ఎమ్మెల్యేలకు తెలియకుండా టిడిపి కూటమి ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టులపై క్యాబినెట్‌లో తీర్మానించి, గ్రామాల్లో 7 వేల ఎకరాల భూమిని సమీకరించడానికి ప్రయత్నాలు చేయడం 1/70, పీసా, ఐదో షెడ్యూల్ గిరిజన చట్టాలను విస్మరించడమేనని, ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు విజయనగరం జిల్లాలో మారిక, అనకాపల్లి జిల్లాలో దేవరాపల్లి, అల్లూరి జిల్లాలో అనంతగిరి ఏరియాల్లో ప్రతిపాదనలు చేశారన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం భూములు సమీకరిస్తున్న ప్రాంతంలో పివిటిజి గిరిజనులు నివసిస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టులతో గ్రామాలన్నీ ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకర హైడ్రో ప్రాజెక్టుల వల్ల ఆదివాసీల బతుకులు ఛిద్రమవుతాయన్నారు. నాడు బాక్సైట్ ఒప్పందాలను రద్దు చేసిన విధంగానే నేడు హైడ్రో ప్రాజెక్టుల అనుమతులనూ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ ఏజెన్సీలో సహజ వనరులను కొల్లగొట్టే ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ అనంతగిరిలో హైడ్రో ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం వెయ్యి మెగావాట్లకు ప్రతిపాదన చేస్తే టిడిపి కూటమి ప్రభుత్వం 1800 మెగావాట్లకు పెంచి అనుమతి ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేసిందని తెలిపారు. హైడ్రో ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ జిల్లా పరిషత్ సమావేశంలో తాను తీర్మానం ప్రవేశ పెడతానన్నారు.



హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దంటూ గ్రామ సభ తీర్మానం

చిట్టెంపాటు వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలంటూ టోకూరు గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన గ్రామ సభ తీర్మానం చేసింది.

ఈ గ్రామ సభ సర్పంచ్ కిల్లో మొస్య అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 51ని రద్దు చేయాలని సభ్యులంతా డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ప్రభుత్వం దుందుడుకుగా ముందుకెళ్తే పనులను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

అమెరికాలోని జలపాతంలో చాగల్లు యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-చాగల్లు

అమెరికాలోని ఓ జలపాతంలో తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ శనగన హరి కిరణ్ గౌడ్ (25) గల్లంతయ్యారు. ఇటీవల ఎంఎస్ పూర్తి చేసిన కిరణ్ అమెరికాలోనే ఉద్యోగంలో చేరినట్టు తల్లిదండ్రులు తెలిపారు. స్నేహితులతో కలిసి జలపాతం వద్దకు వెళ్లిన హరికిరణ్ జలపాతంలో గల్లంతైనట్టు తెలిపారు. హరికిరణ్ తండ్రి రామకృష్ణ గౌడ్ చిక్కాల గ్రామంలో ప్రముఖ పిఎంపి వైద్యులు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హరికిరణ్, చిన్న కుమారుడు వెటర్నరీ కోర్సు చదువుతున్నారు.


హరికిరణ్


మృతి చెందిన ఏనుగు

పులిచెర్లలో ఏనుగు మృతి

ప్రజాశక్తి- సోమల (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని కల్లూరు-సదుం రహదారిలోని పూరేడివారిపల్లి గ్రామం సమీపంలోని పెద్దఒడ్డు చెరువు కట్టకింద ఏనుగు చనిపోయి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించారు. ఏనుగు మృతి చెందిన విషయాన్ని చిత్తూరు వెస్ట్ ఎఫ్ఆర్ఒ, చిత్తూరు జిల్లా డిఎఫ్‌డికి తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆడ ఏనుగుగా గుర్తించారు. చిత్తూరు వెస్ట్ ఎఫ్ఆర్ఒ, తిరుపతి ఎస్‌వి జూ పార్క్ వెటర్నరీ డాక్టర్, సిబ్బంది కలిసి ఏనుగు కళేబరాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిర్వహించారు. మామిడి కాయలు అధికంగా తినడం వల్ల జీర్ణంకాక, అనారోగ్యానికి గురై ఏనుగు చనిపోయినట్లుగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం అదే ప్రాంతంలో పూడ్చిపెట్టారు.

వేతనాలు పెంచాల్సిందే

- సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

తమకు వేతనాలు పెంచాలని, రద్దు చేసిన రాజధాని పెన్షన్‌ను పునరుద్ధరించి ఇవ్వాలని కోరుతూ రాజధాని ప్రాంతమైన అమరావతిలోని పారిశుధ్య కార్మికులు విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద శనివారం సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాజధాని నాయకులు ఎం.రవి మాట్లాడుతూ.. రాజధానిలోని పారిశుధ్య కార్మికులకు గత ఏడేళ్లుగా పైసా వేతనం పెంచలేదన్నారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలు, పక్కనే ఉన్న మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్‌లో నెలకు రూ.21 వేల వేతనం ఇస్తుండగా అమరావతిలోని పారిశుధ్య కార్మికులకు రూ.12 వేలు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. అందరితో సమానంగా రూ.21 వేల వేతనం ఇవ్వాలని, రాజధాని పేదలకు గతంలో ఇచ్చిన పెన్షన్ నెలకు రూ.5 వేలు పారిశుధ్య కార్మికులకు పునరుద్ధరించాలని, పారిశుధ్య కార్మికులను అప్కాసులో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. బడా కంపెనీలకు అడ్వాన్స్ మొబలైజేషన్ ఇస్తూ కార్మికులకు వేతనాలు మాత్రం రెండు, మూడు నెలలకు ఒకసారి చెల్లించడం న్యాయమా? అని ప్రశ్నించారు. ప్రజా రాజధానిలో పేదలు, కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో సిఐటియు నేతలు లక్ష్మణరావు, సుఖవేణి, శేషయ్య, దుర్గ, బుజ్జి, ముత్యాలు, మాలతీదేవి తదితరులు పాల్గొన్నారు.



సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు


బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సంతకం చేస్తున్న రైతు

బలవంతపు భూసేకరణ అడ్డుకుంటాం

- కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణ
- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రభుత్వం చేస్తోన్న బలవంతపు భూసేకరణను వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అజశర్మ మాట్లాడుతూ.. పచ్చని ఉద్దాన తీర ప్రాంతాన్ని ధ్వంసం చేసే కార్గో ఎయిర్‌పోర్టు వద్దని గత ఎనిమిది నెలలుగా వివిధ రూపాల్లో రైతులు పోరాడుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో సుమారు 1400 ఎకరాల భూములను సేకరించి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అంటూ ప్రజలను భ్రమ కల్పిస్తున్నారని విమర్శించారు. తరతరాలుగా ఈ భూమిని నమ్ముకున్న రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కుంటే సహించేది లేదన్నారు. ప్రజాభిప్రాయాలను ప్రభుత్వాలు గౌరవించాలని, లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఏ విధమైన అభివృద్ధి అవుతుంతో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఉపాధిని దెబ్బతీసే అభివృద్ధిని ఎవరూ కోరుకోరని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నిర్మించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని, భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.


ఫ్యాక్టరీలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాక్ సిరామిక్స్‌లో 90 మంది తొలగింపు

- నిరసనకు దిగిన కార్మికులు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ జిల్లా సామర్లకోట స్థానిక ఎడిబి రోడ్‌లో ఉన్న రాక్ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమకు చెందిన 90 మంది కార్మికులను తొలగిస్తున్నట్లు యాజమాన్యం శనివారం ప్రకటించడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. దీంతో యాజమాన్య ప్రతినిధులు కార్మికులతో చర్చించినట్లు సమాచారం. స్టాక్ ఎక్కువగా ఉండిపోయిందని, ప్రస్తుతానికి కార్మికులకు పరిశ్రమలో పని లేదని, అవసరమైతే నెలరోజుల జీతం చెల్లిస్తామని, ఐదు రోజులు పబ్లిక్ హాలిడే ప్రకటిస్తామని, తర్వాత విధుల్లోకి పిలుస్తామని కార్మికులకు నిర్వాహకులు నచ్చచెప్పినట్లు తెలుస్తోంది. తమను కొనసాగించే వరకు ఫ్యాక్టరీ నుంచి బయటకు వెళ్లేది లేదని కార్మికులు బైఠాయించారు. తమను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో ఫ్యాక్టరీ వర్క్ షెడ్‌లో ఆందోళన కొనసాగించారు. యాజమాన్యం స్పందించకపోవడంతో రాక్ సిరామిక్స్ పరిశ్రమలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం విధులకు వెళ్లిన కార్మికులు ఫ్యాక్టరీలోనే ఆందోళన బాట పట్టారు. ఆందోళన విషయం బయటకు రాకుండా కార్మికుల సెల్‌ఫోన్లను నిర్వాహకులు కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది.

కార్మికులకు సిఐటియు మద్దతు

కార్మికుల తొలగింపునకు నిరసనగా కంపెనీ లోపల ఆందోళన చేస్తున్న కార్మికులకు సిఐటియు జిల్లా కార్యదర్శులు దారపురెడ్డి క్రాంతికుమార్, బాలం శ్రీనివాస్ మద్దతు తెలిపారు. గతంలో 12 మందిని, తరువాత 28 మందిని అకారణంగా తొలగించారని, ప్రస్తుతం 90 మంది కార్మికులను తొలగించాలని నిర్ణయించడం చాలా దారుణం అన్నారు. కార్మికుల తొలగింపు అన్యాయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్స్ రూ.48 వేల కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు రూ.48 వేల కోట్ల వరకు ఉన్నాయి. ఇవి అధికారికంగా ఆమోదం పొంది కూడా చెల్లింపులు జరగనివి. మరో రూ.50 వేల కోట్ల వరకు బిల్లులు ఆమోదానికి వేచి ఉన్నట్లుగా ఆర్థికశాఖ అంచనా వేస్తోంది. ఏయే శాఖల్లో ఎంత వరకు బిల్లులు ఇలా ఆమోదానికి నోచుకోకుండా ఉన్నాయన్న వివరాలను శాఖల వారీగా ఆర్థికశాఖ సేకరిస్తోంది. పెండింగ్‌లో ఉన్న రూ.48 వేల కోట్లలో నిర్మాణ రంగంలో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సినవే రూ.15 వేల కోట్ల వరకు ఉన్నాయని, మిగిలినవి ఉద్యోగులకు చెల్లించాల్సినవి, పలు సంక్షేమ కార్యక్రమాలకు ఇంకా ఇవ్వాల్సినవి ఉన్నాయని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.



నేటి నుంచి రొట్టెల పండుగ

- వారం రోజుల పాటు నిర్వహణ


ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మతం పేరుతో విద్వేషాలు సాగుతోన్న నేటి తరుణంలో కులం...మతం...ప్రాంతం...తేడాలు లేవంటూ తామంతా ఒక్కటే అనేలా నెల్లూరు బారాషాహీద్ దర్గాలో రొట్టెల పండుగ ఏటా జరుగుతోంది. ప్రతేడాది మొహర్రం సమయంలో ప్రారంభం కానున్న ఈ పండుగను 2016లో రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. దేశ, విదేశాల నుంచి యాత్రికులు ఈ పండుగకు హాజరవుతారు. ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే పండుగకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. స్వర్ణాల చెరువులో స్నానం చేసి, కోర్కెలు కోరుకొని రొట్టెలు వదిలితే అనుకున్నది నెరవేరుతోందని యాత్రికుల నమ్మకం. ప్రతి ఏటా 20 నుంచి 30 లక్షల మంది యాత్రికులు వస్తారని అధికారుల అంచనా.

ఆదిత్య ఫార్మసీ ఎమ్‌డి నరసింహరాజు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణమంటూ లేఖ

ప్రజాశక్తి-విజయవాడ



ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆదిత్య ఫార్మసీ ఎమ్‌డి సాగి వెంకటనరసింహరాజు (54) ఆత్మహత్య చేసుకున్నారు. విజయవాడ అయోధ్యనగర్‌లోని క్షత్రియ భవన్‌లో శనివారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో ఆదిత్య మెడికల్ ఫార్మసీ నిర్వహిస్తున్న నరసింహారాజు విజయవాడకు చెందిన పిన్నమనేని పరంధామయ్య, విశాఖపట్టణానికి చెందిన పి శివాజి వద్ద అప్పుగా కొంత డబ్బు తీసుకున్నారు. తన స్నేహితుడైన యనమలకుదురుకు చెందిన మహమ్మద్ రఫీ హత్య కేసులో గత ఏడాది అక్టోబర్ 22న అరెస్టు అయ్యారు. ఇటీవలే బెయిల్ మీద బయటకు వచ్చిన ఆయన హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చారు. నరసింహారాజు జైలుకెళ్లిన సమయంలో ఆర్థిక పరమైన లావాదేవీలు స్తంభించిపోయాయి. అధిక మొత్తంలో చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితులు ఏర్పడడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఒక లెటర్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నరసింహారాజు భార్య శాంతి ఇచ్చిన సమాచారం మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14 నుంచి ట్రిపుల్ ఐటి తరగతులు

- ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లలో కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జూన్ 23న అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి జాబితా ప్రకటించినట్లు చెప్పారు. ఈ జాబితా ప్రకారం జూన్ 30 నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగిందన్నారు. గత నెల 30వ తేదీ, ఈ నెల ఒకటో తేదీల్లో నూజివీడు, ఆర్‌కె వ్యాలీలలో విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగిందని, ఈ నెల రెండు, మూడు తేదీల్లో శ్రీకాకుళం, నాలుగు, ఐదు తేదీల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటిలలో అడ్మిషన్లకు సంబంధించి నూజివీడు క్యాంపస్‌లో విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగిందని తెలిపారు. ఎన్ని సీట్లు మిగిలాయో వివరాలను సేకరిస్తామని చెప్పారు. ఖాళీల ప్రకారం అడ్మిషన్లు పొందిన విద్యార్థుల బదిలీ ప్రక్రియకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ బదిలీ ప్రక్రియలో ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు రిజర్వేషన్ వర్తిస్తుందని వివరించారు. ఈ వివరాలను ఆర్‌జియుకెటి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ఈ నెల 14 నుంచి ట్రిపుల్ ఐటి అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తామన్నారు. సెకండ్ కౌన్సెలింగ్‌కు ముందుగానే బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని, బదిలీల ద్వారా భర్తీ అయిన సీట్లు మినహా మిగిలిన ఖాళీలకు సెకండ్ కౌన్సెలింగ్‌లో అర్హత సాధించిన విద్యార్థుల అడ్మిషన్ల కోసం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. సెకండ్ కౌన్సెలింగ్‌కు ముందు ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో బదిలీల ప్రక్రియ ముగించనున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి కొత్త విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు ప్రారంభమయ్యే తరుణంలోనే సెకండ్ కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తామన్నారు. అందుకు అనుగుణంగా సెకండ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు పూర్తి లగేజ్‌తో వచ్చే విధంగా సూచనలు చేస్తామని తెలిపారు.


విశాఖ విమల విద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గంగారావు, విద్యార్థుల తల్లిదండ్రులు

విశాఖ విమల విద్యాలయం తెరవాలని ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయాన్ని వెంటనే తెరవాలంటూ ఆ విద్యాలయం ఎదుట శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. విమల విద్యాలయంపై విశాఖ ఎంపి శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెంటనే బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై 25 రోజులు అవుతున్నా నేటికీ విమల విద్యాలయాన్ని ప్రారంభించకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్కూల్ తెరవకుండా ఆలస్యం చేసి, పిల్లలందరూ టిసిలు తీసుకుని వేరే పాఠశాలలకు వెళ్లేలా చేస్తున్నారన్నారు. తదుపరి ప్రయివేటుకు అప్పగించాలనే కుట్ర దాగి ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. విమల విద్యాలయం ప్రారంభోత్సవానికి యాజమాన్యం సహకరిస్తుందని తెలుపుతూనే మరోవైపు కుట్రలు చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని గత నెల 23న జరిగిన చర్చల్లో అంగీకరించినప్పటికీ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మాట తప్పిందన్నారు. కేంద్రీయ విద్యాలయంలో కూడా ఒకటి, 11వ తరగతుల అడ్మిషన్లు నిలిపివేశారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రూ.11440 కోట్లు ప్యాకేజీ తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న టిడిపి కూటమి ప్రభుత్వం తన కుట్రలను మాత్రం రోజురోజుకూ తీవ్రతరం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వైటి.దాస్, వివి.రమణ, ఐద్వా నాయకులు వేణు పాల్గొన్నారు. అనంతరం ఉక్కు అడ్మిన్ భవనం వద్దకు వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఒక్క పూటలోనే రూ.735 కోట్ల అక్రమార్జన

- జెన్ స్ట్రీట్ ఘరానా మోసం
- విచారణలో సెబీ నిర్లక్ష్యం
- అస్థిరత సృష్టించి రూ.44వేల కోట్లకు టోకరా
- నిండా మునిగిన రిటైల్ ఇన్వెస్టర్లు



ముంబయి : అమెరికన్ ట్రేడింగ్ సంస్థ జెన్ స్ట్రీట్ ఘరానా మోసంలో మరో కీలక విషయం బయటపడింది. ఈ సంస్థ భారత మార్కెట్లలో ఒక్క పూటలోనే రూ. రూ.735 కోట్ల అసాధారణ లాభాన్ని ఆర్జించింది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. 2024 జనవరి 17న ఒక్క పూటలోనే బ్యాంక్ నిఫ్టీ ఆప్షన్స్ నుండి రూ.734.93 కోట్లు సంపాదించింది. ఆ సంస్థకు అత్యంత లాభదాయక రోజుగా నిలిచింది. ఆ సమయంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఫలితాలు నిరాశకు గురైయ్యాయని అపాదించబడింది. ఈ విషయం తెలియక కృత్రిమంగా పెంచబడిన ఇండెక్స్ స్థాయిల వద్ద రిటైల్ ఇన్వెస్టర్లు ట్రేడ్ చేశారు. అధిక ధరల వద్ద కొనుగోలు చేసిన రిటైల్ ఇన్వెస్టర్లు భారీ మొత్తంలో నష్టాలను చవి చూశారు. జెన్ స్ట్రీట్ భారతీయ సంస్థ జెఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రయివేటు లిమిటెడ్ ఈ కార్యకలాపాలలో కీలక పాత్ర పోషించింది. గతేడాది ఏప్రిల్‌లోనే జెన్ స్ట్రీట్‌పై అక్రమార్జన ఆరోపణలు రాగా.. సెబీ దీన్ని తేల్చడానికి ఏడాది పైగా సమయం తీసుకోవడం రెగ్యూలేటరీ సంస్థ నిర్లక్ష్యానికి నిదర్శనమని నిపుణులు విమర్శిస్తున్నారు.

అస్థిరతను పెంచి.. అడ్డగోలు సంపాదన

అమెరికాలో జెన్ స్ట్రీట్ 2000లో కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సంస్థ 45 దేశాల్లో 2,600 మంది ఉద్యోగులను కలిగి ఉంది. భారత మార్కెట్‌లోకి 2020 డిసెంబర్‌లో ప్రవేశించింది. జనవరి 2023 నుండి మార్చి 2025 కాలంలో అప్షన్స్ ట్రేడింగ్‌లో రూ.43,289 కోట్ల అక్రమార్జనకు పాల్పడింది. ఈ సంస్థ షార్ట్ సెల్లింగ్, ఇతర సంక్లిష్ట ట్రేడింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి మార్కెట్ ధరలను తారుమారు చేసింది. ఈ కుంభకోణం భారత డెరివేటివ్స్ మార్కెట్‌లోని లోపాలకు నిదర్శనం. ఆర్థిక సంవత్సరం 2023-24లో విదేశీ, ప్రొప్రైటరీ ట్రేడర్లు అల్గారిథమ్‌ల ద్వారా రూ.61,000 కోట్లకు పైగా లాభాలను ఆర్జించారు. ఇది రిటైల్ ఇన్వెస్టర్లు కోల్పోయిన మొత్తానికి సమానంగా ఉండటం ఆందోళనకరం. ఈ ఘటన కఠినమైన నియంత్రణల అవసరాన్ని నొక్కి చెబుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

జెన్ స్ట్రీట్ అధిక ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్, మార్కెట్ మానిప్యులేషన్ వ్యూహాలను ఉపయోగించి కృత్రిమంగా షేర్ల ధరలను ప్రభావితం చేయడం ద్వారా భారీ లాభాలను గడించింది. జెన్ స్ట్రీట్ తన అధునాతన అల్గారిథమ్‌ల ద్వారా స్టాక్ ధరలను ప్రభావితం చేసే విధంగా ట్రేడింగ్ ఆర్డర్లను వేగంగా అమలు చేసింది. ఈ వ్యూహం ద్వారా మార్కెట్లో అస్థిరతను సృష్టించి అక్రమార్జనకు పాల్పడింది. ఈ ట్రేడింగ్ పద్ధతులు నియమ, నిబంధనలకు విరుద్ధమైనవని సెబీ ఎట్టకేలకు గుర్తించింది. భారతీయ స్టాక్ మార్కెట్ నియమాలను జెన్ స్ట్రీట్ ఉల్లంఘించినట్లు సెబీ తెలిపింది.

ఐఐటి విద్యార్థికి రూ.4.3 కోట్ల వేతనం..

భారత స్టాక్ మార్కెట్లలో అతిపెద్ద మోసపూరిత కుంభకోణానికి పాల్పడిన జెన్ స్ట్రీట్ ఉద్యోగుల ఎంపికలో భారీ ప్యాకేజీలను ఆఫర్ చేసిన ఘటనలు బయటికి వస్తున్నాయి. 2025 జనవరిలో ఈ సంస్థ ఐఐటి మద్రాస్ విద్యార్థికి ఏకంగా రూ.4.3 కోట్ల వార్షిక జీతం ప్యాకేజీని ఆఫర్ చేసింది. ఇది భారత్‌లోని ఐఐటిల్లో అత్యధిక ప్లేస్‌మెంట్ ఆఫర్లలో ఒక్కటిగా నిలిచింది. ముఖ్యంగా కోడింగ్, అల్గారిథమ్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్‌లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు అధిక వేతన ప్యాకేజీలను ఆఫర్ చేసింది.

ఎలా బయటపడింది..!

జెన్ స్ట్రీట్ మోసాలపై 2024 ఏప్రిల్‌లోనే ఆరోపణలు వచ్చాయి. అనైతిక ట్రేడింగ్ వ్యూహం ద్వారా జెన్ స్ట్రీట్ భారత డెరివేటివ్ మార్కెట్ నుంచి 100 కోట్ల డాలర్లు (రూ.8550 కోట్లు) ఆర్జించిందని మిలీనియం మేనేజ్‌మెంట్ ఆరోపించింది. ఆ రిపోర్ట్ ఆధారంగానే సెబీ జెన్‌స్ట్రీట్ గ్రూప్‌నపై సెబీ దర్యాప్తు ప్రారంభించింది. అయితే దీన్ని తేల్చడానికి సెబీ ఏడాది పైగా సమయం తీసుకోవడం ఆ రెగ్యూలేటరీ సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నాయి.

ఎయిమ్స్ కార్డియాలజీలో నూతన సేవలు

- బై-ప్లేన్ క్యాత్‌ల్యాబ్ మెషిన్‌ను ప్రారంభించిన ప్రొఫెసర్ అహంతెం

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్‌లో కార్డియాలజీ విభాగంలో ఏడవ జనరేషన్ బై-ప్లేన్ క్యాత్‌ల్యాబ్ మెషిన్‌ను ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిఇఒ ప్రొఫెసర్ అహంతెం శాంతాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుండె సంరక్షణ, న్యూరోవాస్కులర్ ఇంటర్వెన్షన్స్ సేవలు, సంక్లిష్ట ఎండోవాస్కులర్ సేవలు గణనీయంగా మెరుగుపరిచే అత్యాధునిక ఇంటర్వెన్షనల్ ఇమేజింగ్ ప్లాట్‌ఫామ్ అయిన ఏడవ జనరేషన్ అజురియన్ బై-ప్లేన్ క్యాత్‌ల్యాబ్ సిస్టమ్ సేవలు ఇకపై మంగళగిరి ఎయిమ్స్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అజురియన్ బై-ప్లేన్ వ్యవస్థ ఇమేజ్-గైడెడ్ థెరపీలో సాంకేతిక పురోగతిని సూచిస్తుందని, అసమానమైన ఇమేజ్ స్పష్టత, రియల్-టైమ్ 3డి నావిగేషన్, అధునాతన సాఫ్ట్‌వేర్ ఇంటిగ్రేషన్‌ను అందించడమే కాకుండా రోగులు, వైద్యులు రేడియేషన్‌కు గురవడాన్ని తగ్గిస్తుందని వివరించారు. దాదాపు రూ.11 కోట్ల ఖరీదు చేసే అజురియన్ బై-ప్లేన్ క్యాత్‌ల్యాబ్ ద్వారా కరోనరీ యాంజియోప్లాస్టీ, పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు వైద్యం, స్ట్రక్చరల్ హార్ట్ ప్రొసీజర్లు, ఎలక్ట్రోఫిజియోలాజికల్ అధ్యయనాల్లో మరింత భద్రత, కచ్చితత్వం మెరుగవుతుందని చెప్పారు. రోగ నిర్ధారణ, గుండె సంరక్షణను బలోపేతం చేసే దిశగా అత్యాధునిక ట్రెడ్‌మిల్ టెస్ట్ యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నాన్-ఇన్వాసివ్ డయాగ్నస్టిక్ సాధనం కొరోనరీ ఆర్టరీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడంలో, గుండె ఫిట్‌నెస్, వ్యాయామ సహనాన్ని అంచనా వేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. వీటితోపాటు విద్యార్థులు, సిబ్బంది కోసం హాస్టల్ ప్రాంగణానికి సమీపంలోని క్రీడా సముదాయంలో నాలుగు కోర్టులతో కూడిన అత్యాధునిక బ్యాడ్మింటన్ కోర్టు సముదాయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎఆర్ నటరాజ్, కార్డియాలజీ విభాగ అధిపతి బి.అమృత గణేష్, మీడియా సెల్ ప్రొటోకాల్ విభాగం ప్రతినిధి డాక్టర్ కె.వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కార్డియాలజీ విభాగం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ అహంతెం శాంతాసింగ్

డీప్ టెక్ స్టార్టప్‌లకు రూ.10 వేల కోట్ల అదనపు నిధులు

- మంత్రి పియూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లోని డీప్ టెక్ స్టార్టప్‌లు, పరిశోధనలకు రూ.10,000 కోట్ల అదనపు నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఇది రూ.1 లక్ష కోట్ల పరిశోధన అభివృద్ధి, ఆవిష్కరణ పథకంలో భాగమన్నారు. ఇందులో రూ.20,000 కోట్లు ఇప్పటికే 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించబడ్డాయి. ఈ నిధులు కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, రోబోటిక్స్, క్లీన్ ఎనర్జీ రంగాల్లో ఆవిష్కరణలకు ఉపయోగపడతాయన్నారు. ఇందులో భాగంగా 100 డీప్ టెక్ స్టార్టప్‌లను గుర్తించి ప్రోత్సహిస్తారు.

జులై చివరలో మహీంద్రా ఎక్స్‌ఇవి 9ఇ డెలివరీలు

ముంబయి : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యువి) ఎక్స్‌ఇవి 9ఇ, బిఇ 6 ప్యాక్ వాహనాలను జులై చివరి నుంచి డెలివరీ చేయనున్నట్లు తెలిపింది. బిఇ6 ప్యాక్ ప్రారంభ ధరను రూ.21.90 లక్షలుగా, ఎక్స్‌ఇవి 9ఇ ధరను ప్రారంభ ధరను రూ.24.90 లక్షలుగా నిర్ణయించింది. 59కిలోవాట్ బ్యాటరీ వేరియంట్ మోడల్‌ను ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 400 కిలోమీటర్లు, 79 కిలోవాట్ బ్యాటరీ వేరియంట్ 500 కిలోమీటర్లు ప్రయాణించనున్నాయి.

సంపాదకీయం

శ్రమ దోపిడి

పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు. ఎనిమిది గంటల పని దినం కోసం ఉద్యమం మొదలై శతాబ్దాలు గడుస్తున్నా... అనేక దేశాలలో కార్మికులు అధిక పనిగంటలతో పోరాడుతున్నారు. సమాన వేతనం, మెరుగైన పని పరిస్థితుల కోసం, అధిక పనిగంటలు, తక్కువ వేతనంపై పోరాటం కొనసాగుతూనే వుంది. నిజానికి శాస్త్ర, సాంకేతిక పురోగతి మూలంగా 8గంటల పని... 7గంటలు, 6గంటల పనిదినంగా మారాలి. కానీ, 10, 12, 14 గంటలంటూ సమయాన్ని పెంచేస్తున్నారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వంటి వారు ఏకంగా వారానికి 70గంటలు పనిచేయాలని ప్రతిపాదిస్తున్నారు. 24గంటల్లో 8గంటలు పని, మరో 8గంటలు విశ్రాంతి, మిగతా 8 గంటలు వ్యక్తిగత, కుటుంబ జీవితం కోసం అనే నినాదంతో సాధించుకున్న హక్కును గుంజుకునే ప్రయత్నం శరవేగంగా జరుగుతోంది. మనిషికి అవసరమైన 8 గంటల నిద్రా కాలాన్ని కూడా కార్పొరేట్లు కబ్జా చేసే ప్రక్రియ ఇది. కార్మికుల శ్రమను దోచుకునే 12 గంటల పనికి ప్రభుత్వాలు వంత పాడుతున్నాయి.

1886 చికాగోలో కార్మికుల పోరాటం... ప్రపంచానికి సాధించి పెట్టిన 8గంటల పని, నేడు మళ్లీ ప్రమాదంలో పడింది. 'పని గంటల కాలపరిమితి పెరిగితే, ఆ మేరకు కార్మికవర్గం తమ సాంఘిక జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని కోల్పోతుంది' అంటారు కారల్ మార్క్స్. 8గంటల పనిదినం అమలు జరుగుతున్న దాదాపు 139 సంవత్సరాల తర్వాత నేడు మోడీ ప్రభుత్వం 8గంటల పని దినాన్ని రద్దు చేసింది. కార్మిక సంఘాల చట్టం-1926 వంటి 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, ఆ స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చింది. దీనికి వ్యతిరేకంగా దేశంలోని 70కోట్ల మంది కార్మికులు పోరాటాలు నిర్వహించినా కేంద్ర బిజెపి ప్రభుత్వం స్పందించలేదు. గుజరాత్‌లో ఫ్యాక్టరీల చట్టం, 1948లోని కీలక నిబంధనలను సవరించి, కార్మికుల రోజువారీ పని గంటలను 12గంటలకు పెంచడానికి అనుమతించారు. ఉపాధి సృష్టికి ఈ చట్ట సవరణ అవసరమని అక్కడి బిజెపి ప్రభుత్వం చెబుతోంది. 2020లో, ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇదే విధంగా చట్టాన్ని సవరించినప్పుడు, దానిపై కేసు నమోదైంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వమే ఆ చట్టాన్ని ఉపసంహరించుకుంది. తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత రావడంతో, ప్రభుత్వం దానిని రద్దు చేసింది. వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పనివేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం కూడా సవరించి, రోజుకు 10గంటలు పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగమని ప్రభుత్వం చెబుతోంది. రోజుకు 10గంటలు పనిచేయాలంటూ మన రాష్ట్ర ప్రభుత్వం జీవో తెచ్చింది. గత సంవత్సరం కర్ణాటక కూడా కార్మిక సంక్షేమ చట్టాన్ని ఇదే విధంగా సవరించింది. కానీ, అలాంటి సవరణ తీసుకురావడానికి ముందు, ఏ ప్రభుత్వం కూడా కార్మిక సంఘాలతో చర్చించిన దాఖలాలు లేవు.

8గంటల పని దినాలకు బదులు, ఆరు గంటల పని దినాన్ని అమలు చేయాలని, అప్పుడే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని యూరోపియన్ దేశాల్లో పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. కానీ భారతదేశంలో ఆలోచనలు తిరోగమనంలో నడుస్తున్నాయి. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో 8గంటల పని, ఒత్తిడి తగ్గాల్సి వుండగా, దానికి భిన్నంగా 12- 14 గంటల పని విధానం తేవడమంటే కార్మికులను శారీరకంగా, మానసికంగా అధిక ఒత్తిడికి గురిచేయడమే. ఇది నేరుగా కార్మిక హక్కులపై దాడి, వారి జీవన ప్రమాణాలను, కుటుంబ సమయాన్ని నాశనం చేయడమే. 'కరోనా తర్వాత మానసిక ఆరోగ్య సమస్యలు పెరిగాయి. పనిగంటలు పెరగడం వల్ల ఈ సమస్యలు మరింత తీవ్రతరమౌతాయి' అంటారు సైకియాట్రిస్ట్ శివపాలన్. దీనికితోడు 'మధ్య తరగతి ప్రజలపై ఏఐ ముప్పు పెరిగిందని, దీనివల్ల జాబ్ రోల్స్ మారడం వంటి సమస్యలు ఎదుర్కొంటారని' మెకన్సీ నివేదిక తాజాగా వెల్లడించింది. 'ఉద్యోగులు తమను తాము విముక్తి చేసుకోవాలంటే, వారు ఐక్యంగా, సంఘటితంగా పోరాడాలి' అంటారు లెనిన్. 8 గంటల పని దినం సాధించిన చారిత్రక విజయాన్ని కాపాడుకోవడం, మరింత మెరుగుపర్చుకోవడం కోసం కార్మికవర్గం, సంఘాలు నిరంతరం పోరాటాలు నడపాల్సిన సమయం ఇది. చికాగో వీరులు అందించిన స్ఫూర్తిని భవిష్యత్తరాలకూ అందించాల్సిన బాధ్యత నేటి శ్రమజీవులపై వుంది.

మహనీయుల మాట



తటస్థం అనేది నిష్క్రియాత్మకంగా పని చేస్తుంది. కానీ అది పని చేస్తుంది. అది మేధస్సును నాశనం చేసే ముడి సరుకు. అది నెత్తినెక్కి నాట్యమాడుతుంటే, మానవులు తమ సంకల్పాన్ని వదులుకుంటారు. చట్టాలను ఇష్టం వచ్చినట్టు చేయడానికి అవకాశం ఇస్తారు. అప్పుడు తిరుగుబాటు ద్వారా మాత్రమే వాటిని ఎదిరించే అవకాశం మిగులుతుంది.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త, రాజకీయవేత్త.



ఎవరి సొమ్ము.. ఎవరి సోకు? ఇన్‌ఫ్రా షాకు!



తెలకపల్లి రవి

ఎప్పుడు ఏ మీడియా చూసినా భారీ పథకాల ప్రారంభం, శంకుస్థాపన, అధ్యయనం, చర్చలు, ప్రతినిధి బృందాల సందర్శనల హైప్ లేకుండా ఒక్క రోజుండదు. వివిధ రాష్ట్రాలలో ఏదో ఒకచోట ఏ రోజైనా ఇదే హడావుడి. సువిశాల దేశం గనక ఇలా జరగడం సహజమే. అయితే ఇందులో ఏవి, ఏ తేదీన, ఎలా ప్రారంభమైనాయి? ఎన్ని రకాలుగా ముగిశాయి? ఎన్ని సమస్యలు ఎదుర్కొన్నాయి? ఎవరికి ఏ మేరకు ఉపయోగ పడుతున్నాయి? వంటి ఫాలో అప్ (కొనసాగింపు కథ)కు మాత్రం ఎలాంటి హంగామా వుండదు. హైప్‌లో గత, ప్రస్తుత ప్రభుత్వాల నేతలు పోటీ పడుతుంటారు. పోటాపోటీ పిపిటి లు (పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు) సమర్పిస్తారు. పిపిపి అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్. నిర్మాణాలకు, ఒప్పందాలకు సంబంధించింది. వీటిపై కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రపంచ బ్యాంకు వరకూ విస్తారమైన ప్రతిపాదనలు ఇంకా చెప్పాలంటే ఆఫర్లు అందుబాటులో వున్నాయి. ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మౌలిక చట్రంతో నిమిత్తం లేకుండా తను ఇప్పించే దానధర్మాలకు నాలుగో పి జోడించి మరీ తనదైన పి 4 హడావుడి సాగిస్తున్నారు. ఆ దానమూ దాంతో ముడిపడిన ధర్మమూ మరో కథ. స్కూళ్లలో బల్లలూ బెంచీలు, ఆస్పత్రులలో పడకలూ ఆఖరుకు టాయిలెట్లకు కూడా సొమ్ములు లేవనే పాలకులు వేల లక్షల కోట్ల విలువైన ఈ పథకాలను అవలీలగా ప్రకటించేయడం, ప్రచారార్భాటం చేయడం ఎలా జరుగుతుంది? బిల్లులు చెల్లించలేదని, బకాయిలు పేరుకుపోయాయనీ మోయలేని భారం మీద పడిందని సణుక్కుంటూ కథనాలు ఇస్తూనే భారీ ఇన్వెస్టర్లు, కంపెనీలు వీటి కోసం ఎందుకు పోటీ పడుతుంటాయి? మరొకరికి వస్తే లేక ప్రభుత్వాలు మారితే వ్యతిరేక లీకులు ఎందుకు ఇస్తుంటారు? ఇన్ని వేల కోట్ల భారం నిజంగా తట్టుకుంటారా?

ఎన్నెన్ని ఉపద్రవాలు? అపశ్రుతులు?

ఈ ప్రశ్నలు అడగ్గానే కొందరికి కోపమొస్తుంది. అభివృద్ధిని చూడలేని వారంటూ ఆగ్రహంతో రెచ్చిపోతారు. కాలం చెల్లిన సిద్ధాంతాలంటారు. తమ ఇమేజిని చూసి విశ్వ కుబేరులు వరుస కట్టి వచ్చేస్తున్నారని విపరీత ప్రచారాలతో ఉక్కిరిబిక్కిరైపోతారు. కానీ తేడాలు వస్తే మాత్రం ప్రత్యర్థులు కారణమంటారు. ఇటీవలి కాలంలో మచ్చుకు కొన్ని ఉదాహరణలు...కేంద్రం బాధ్యతగా నిర్మించవలసిన పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాం దెబ్బతిన్నాయి. మేడిగడ్డ డ్యాం పిల్లర్లు కుంగిపోయాయి. శ్రీశైలం ఎడమ కాలువ సొరంగ నిర్మాణంలో ప్రమాదం జరిగి పలువురు ప్రాణాలు కోల్పోగా సహాయ చర్యలు కూడా ఆలస్యమైనాయి. ఢిల్లీ, జబల్పూర్, గౌహతి, పోర్టు బ్లెయిర్ (అండమాన్) ఎయిర్‌పోర్టులు రకరకాలుగా దెబ్బతిని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. 2022 జులై 22న ప్రధాని మోడీ ప్రారంభించిన బుందేల్‌ఖండ్ హైవే కొద్ది రోజుల్లోనే దెబ్బతిన్నది. 2022 అక్టోబరులో ఆయన ప్రారంభించిన పూర్వాంచల్ సోనాపూర్ హైవే లో 18 అడుగుల లోతు గుంట పడింది. రూ.920 కోట్లతో నిర్మించిన



> **తక్షణ సమస్యలపై, కోర్కెలపై మాట్లాడకుండా విజన్ 2047 గురించి చెప్పడం, వీగిపోయిన విజన్ 2020ని పెద్ద విజయంలా చూపించడం ఇందులో భాగమే. విశ్వగురు మోడీ పంచ రంగుల ప్రకటనలు వీటిని విస్తరించిన చిత్రమే. విశాఖ ఉక్కును నాశనం చేసి మిట్టల్‌ను తీసుకు వచ్చింది మేమంటే మేమని వైసిపి, టిడిపి పోటీ పడటం...ఉర్సా నుంచి టాటాల వరకూ భూ పందేరాలు, వారొక స్వామికి ఇచ్చిన భూమిని వీరు మరో కార్పొరేట్ స్వామికి కట్టబెట్టాలని చూడటం... ఒకటేమిటి, సమస్తం ఆ కోవలోవే. పేరుకు ప్రైవేటు అన్నా ఇన్‌ఫ్రాలో 22 శాతం మాత్రమే వారి పెట్టుబడి కాగా ప్రభుత్వ బ్యాంకుల నుంచే వేల కోట్ల రుణాలు తీసుకుంటారనీ, వాటిలో చాలా భాగం ఎగవేస్తారనీ తెలిసిందే. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగానే దేశంలో సమస్త కార్మికవర్గం వివిధ తరగతుల ప్రజల మద్దతుతో జులై 9న సమ్మెకు సిద్ధమవుతున్నది.**

ప్రగతి మైదాన్ స్పోర్ట్స్ మైదానం సొరంగం కూలిపోయింది. బీహార్‌లో గత ఏడాది జులై నాటికి 13 బ్రిడ్జిలు కూలిపోయాయి. గుజరాత్‌లోనూ అయిదు బ్రిడ్జిలు కూలాయి. గుజరాత్‌లోనే రాజ్‌కోట్ టిఆర్‌పి ప్లే జోన్‌లో ఘోరమైన అగ్ని ప్రమాదం భారీ ప్రాణ నష్టానికి కారణమవగా లైసెన్సు కూడా లేకుండా అలాంటివి 18 నడుస్తున్నాయని తేలింది. ఇక హైటెక్ రైల్వేల గురించి, సదుపాయాల గురించి ఎంతగానో చెప్పుకుంటున్నా 2019-24 మధ్యలో ఏడాదికి సగటున 44 రైల్వే ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోవడానికి దారితీశాయి. టూరిజం, వాట్సప్ గవర్నెన్స్, జిపిఎస్ ట్యాగింగ్ వంటి ఎన్నో గొప్పల మధ్య వరుసగా కుంభమేళా నుంచి బెంగళూరు క్రికెట్ కప్ వేడుకలు, తిరుపతి సందర్శనలు ఇలా అనేక చోట్ల తొక్కిసలాటలను కూడా నివారించలేక క్రౌడ్ మేనేజిమెంటు వ్యవస్థలు ఘోరంగా విఫలమైనాయి. ఇందులో ఏవీ కావాలని అల్లిన కథలో లేక రాజకీయ వ్యతిరేకతతో చెబుతున్నవో కాదు. కళ్ల ముందు ఇటీవల చూసినవే. ఎల్‌జి పాలిమర్స్ అనకాపల్లి ఫార్మా నుంచి మొన్న హైదరాబాద్ సిగాచీ కెమికల్స్ వరకూ వందల ప్రాణాలు బలైన ప్రమాదాలను ఇక్కడ చెప్పడం లేదు. మనం తరచూ వింటుంటాము. బ్రిటిష్ వారు వేసిన బ్రిడ్జిలు, నిజాం కట్టిన ఆనకట్టలూ కాకతీయుల నాటి చెరువులూ రెడ్డి రాజుల నాటి కట్టడాలూ అలాగే వుంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్భాటంగా కట్టిన నవీన నిర్మాణాలెందుకు ఇలా అవుతున్నాయని! తమ నిర్మాణ నిర్వహణా దక్షతను గురించి గొప్పలు చెప్పుకునే పాలకవర్గ నేతలెవరూ ఈ ఘోరాల పరంపరకు బాధ్యత తీసుకోలేదు. చివరాఖరికి అయోధ్య రామమందిరం లీకులకు గురైతే భారీ ఖర్చుతో వేసిన రోడ్డు గుంటలు పడిపోయింది.

గనులూ, వనరులూ సమస్తం..సర్వత్రా..

ఈ జాబితా ఇలా పొడగించుకుంటూ పోవడం కంటే వీటి లోగుట్టు తెలుసుకోవడం ముఖ్యం. ఇన్‌ఫ్రా రంగం అనే మాట అనేక రకాలుగా వాడుతున్నారు గానీ మౌలిక సదుపాయాల రంగం అన్నది ఇస్తున్న అర్థం. అయితే నిర్మాణాల నుంచి గనులు, భూములు, అడవులు, కొండల వంటి ప్రకృతి వనరుల వరకూ ఆ రంగంలోకి చేరతాయి. అవి ప్రభుత్వాల అధీనంలో వుంటాయి. లేకపోయినా సేకరణలు, సమీకరణలు, చట్టబద్ధమైన హక్కులు సర్కార్లకే వుంటాయి. ఇన్‌ఫ్రా వసతుల కల్పన అంటూ వాటిని కట్టబెట్టడం. ఒకవేళ అందుబాటులో లేకపోతే అధికారంతో హస్తగతం చేసుకుని అప్పగించడం నిరంతరాయంగా సాగిపోతున్నది. పాలకులను బట్టి ఆ ఒప్పందాలు చేతులు మారొచ్చు గానీ వరవడి మారదు. హైదరాబాద్ చుట్టుపక్కల రియల్టీలో ఒక సంస్థ ప్రధాన పాత్ర వహించింది. తెలుగు రాష్ట్రాల్లో భారీ ప్రాజెక్టులు ప్రధానంగా ఒక సంస్థ చేస్తుంటుంది. ఇలాంటి వారు ఇక్కడ ప్రాంతీయ పార్టీలనూ అక్కడ మోడీ సర్కారును ప్రసన్నం చేసుకుంటూనే వుంటారు. దేశ వ్యాపితంగా హైవేలు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చుట్టూనే తిరుగుతుంటాయనేది జాతీయ రహస్యం. ఇక గనులు వనులూ అదాని, అంబానీ, వేదాంత వంటి వారి నిర్వహణలోకి వెళతాయి. కాంగ్రెస్ కాలంలో అంబానీ ప్రధాన పాత్ర వహిస్తే బిజెపి హయాంలో అదాని దూకుడు పెరిగి వుండవచ్చు గానీ వీరైనా వారైనా కార్పొరేట్ చట్రంలో వున్నవారే. మోడీ సర్కారుకు మొదటి రెండుసార్లు పూర్తి మెజార్టీ, ఇప్పుడు కూడా ఆధిపత్యం వున్నందువల్ల మరింత జోరుగా సాగడం సాధ్యమవుతున్నది. అంతర్జాతీయంగా మోడీ ట్రంప్‌తో వుండటం, ఆయన స్వయంగా ఇండియాలో కూడా ట్రంప్ టవర్స్ కట్టిన ప్రపంచ రియల్టర్ కావడం గమనించదగింది. బిల్ క్లింటన్ భార్య, బుష్ కుమారులు కూడా చమురు సామ్రాజ్యాలకు, ఆయుధ వ్యాపార వలయాలకు సన్నిహితులే. ప్రత్యక్ష పరోక్ష పద్ధతులలో ధన ప్రవాహాలు ఎటు నుంచి ఎటు సంచరిస్తున్నాయో ఒక పట్టాన బోధ పడకపోవచ్చు. వీటిపై చాలా అధ్యయనాలు, పరిశోధనా పత్రాలే వున్నాయి. అందులో ఆర్థిక, రాజకీయ కోణాలను చూద్దాం. ఎందుకంటే రాజకీయ మూలాలు ఎప్పుడూ ఆర్థికంలోనే వుంటాయి గనక.

ఉత్పత్తి నుంచి ఉత్తుత్తికా?

ఆర్థిక సంక్షోభాల కారణంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో ఉత్పత్తి రంగం వెనకపట్టు పట్టింది. గిరాకీ లేదు గనక ఉత్పత్తి దాంతో పాటు ఉపాధి కూడా కరువై పోతున్న స్థితి. దీనంతటి వెనక వున్న ప్రపంచీకరణ తెచ్చిన భయానకమైన ఆర్థిక వ్యత్యాసాల ఫలితంగా నయా సంపన్న కుబేర వర్గాల గిరాకీ వున్న వస్తువులే చేయాలి. దానికోసమే పోటీ పడాలి. వస్తూత్పత్తి రంగంలో భారీ పరిశ్రమలపై పెట్టుబడులు పెట్టి విస్తార వినియోగదారుల కోసం వ్యాపారం చేసే అవకాశం లేదు గనక ద్రవ్య రంగంలోనూ స్పెక్యులేషన్ రంగంలోనూ కేంద్రీకరించాలి. అవేమో ఒడుదుడుకులకూ కుంభకోణాలకు నిలయంగా మారిపోతుంటాయి. అందులో భాగంగా వేల కోట్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వెంచర్లు, ఇళ్ల నిర్మాణం చేసినా దీర్ఘకాలం వేచి వుండక తప్పదు. ప్రతి నగరంలో లక్షల యూనిట్లు అమ్మకం జరగాల్సి వుంది. కనుక సరక్షితమైంది గనుల వంటి ప్రకృతి వనరులు, భూములు స్వాధీనం చేసుకోవడం. వాటిలో ప్రభుత్వ సంస్థల రుణాలతోనే నిర్మాణాలు చేసి తమ పెత్తనం లాభాల దాహం తీర్చుకోవడం. అందుకోసం రకరకాల పేర్లతో భారీ పథకాలతో రోడ్లు, ఫ్లైవోవర్లు, వంతెనలు, టనెళ్లు, హైవేలు, రేవులు, వినోద సముదాయాలు, టూరిస్టు ప్లాజాలు నిర్మించడం, వీటి మధ్య ఆహార చెయిన్లు సరఫరా కోసం అగ్రిగేటర్లు. అంటే ఒకప్పటిలా ఈ మొత్తంలో కూడా మామూలు మనుషులకు ఉద్యోగాలు దొరికే అవకాశాలు తగ్గిపోతాయి. గతంలో గని కార్మికులు, కార్ఖానా వర్కర్లు రాత్రి పగలు లేకుండా రోజంతా పని చేస్తే ఇప్పుడు గిగ్ వర్కర్లు ఆ పని చేస్తుంటారు. ఈ వ్యాపార వ్యవహారాలు, లావాదేవీలు చూడటానికి రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు, కార్పొరేట్ అధిపతుల మాఫియాలు తయారై కూర్చున్నాయి. ముంబాయిలో మొదలైన ఈ రాజకీయం ఇప్పుడు దేశమంతా తరతమ తేడాలతో విస్తరించింది. ఆ మాటకొస్తే ఇప్పటికే ముంబాయి, గుజరాత్‌లలో ఇది లోతుగా పాతుకు పోయి వున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. దేశంలో పారిశ్రామిక పెట్టుబడి మొదలైంది కూడా ఇంచుమించు అక్కడే. మోడీ హయాంలో అది మరీ పట్టు పెంచుకున్న వైనం సుస్పష్టం. కాకపోతే ఇదో రాజకీయార్థిక లింకు. వాటి వల్ల మేలు జరగదని కాదు కానీ వాటి పరిమితులూ కఠోర షరతులేమిటన్నది ప్రశ్న.

మరిన్ని కలలు.. కబుర్లు...

రెండోది రాజకీయాంశం. ఎక్కడిదాకా ఎందుకు! తెలుగు రాష్ట్రాలే చూద్దాం. ప్రాజెక్టుల సమస్యలు ఇంత తీవ్రంగా వుంటే చంద్రబాబు నాయుడు బనకచర్ల రూ. 80 వేల కోట్లతో తొలి ప్రైవేటు ప్రాజెక్టుగా కడతానంటారు. ఆగిపోయిన అమరావతి వేగంగా పూర్తి చేసే బదులు మరో 40 వేల ఎకరాలు తీసుకుంటామని, అందులో పెద్ద భాగం ప్రైవేటు ఎయిర్ పోర్టు కడతానని అంటారు (అంతకు ముందున్న గన్నవరం ప్రభుత్వ ఎయిర్‌పోర్టు మాటేంటి?). రాజధాని దశల కంటే క్వాంటమ్ ప్రాజెక్టు కలలు చూపిస్తారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీపై విదేశాల్లో చర్చలు జరిపి వస్తారు. ఎ.పి లో తాడూ బొంగరం లేని మెట్రోపై హడావుడి చేస్తే తెలంగాణలో మెట్రో మలి దశపై సవాళ్లు నడుస్తాయి. మెడికల్ ఇన్‌ఫ్రా, ఐ.టి ఇన్‌ఫ్రా, మళ్లీ రకరకాలు. రైతుల భూసేకరణలు, గిరిజనులపై దాడులు, నిరాశ్రయత, వనరుల హరింపు షరామామూలుగా నడుస్తాయి. ఆఖరుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వచ్చి 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టులను తరిమి వేశాక వాటిని అభివృద్ధి కారిడార్లుగా మారుస్తామని ప్రకటిస్తారు. రాజకీయ, సైద్ధాంతిక కోణాలు అలా వుంచితే అన్ని పార్టీలూ కోరుతున్నా మావోయిస్టులతో చర్చలు మొదలెట్టకుండా పూర్తిగా నిర్మూలన చేస్తామని బెదిరించడం ఆ వనరుల స్వాధీనం కోసమే. తక్షణ సమస్యలపై, కోర్కెలపై మాట్లాడకుండా విజన్ 2047 గురించి చెప్పడం, వీగిపోయిన విజన్ 2020ని పెద్ద విజయంలా చూపించడం ఇందులో భాగమే. విశ్వగురు మోడీ పంచ రంగుల ప్రకటనలు వీటిని విస్తరించిన చిత్రమే. విశాఖ ఉక్కును నాశనం చేసి మిట్టల్‌ను తీసుకు వచ్చింది మేమంటే మేమని వైసిపి, టిడిపి పోటీ పడటం...ఉర్సా నుంచి టాటాల వరకూ భూ పందేరాలు, వారొక స్వామికి ఇచ్చిన భూమిని వీరు మరో కార్పొరేట్ స్వామికి కట్టబెట్టాలని చూడటం... ఒకటేమిటి, సమస్తం ఆ కోవలోవే. పేరుకు ప్రైవేటు అన్నా ఇన్‌ఫ్రాలో 22 శాతం మాత్రమే వారి పెట్టుబడి కాగా ప్రభుత్వ బ్యాంకుల నుంచే వేల కోట్ల రుణాలు తీసుకుంటారనీ, వాటిలో చాలా భాగం ఎగవేస్తారనీ తెలిసిందే. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగానే దేశంలో సమస్త కార్మికవర్గం వివిధ తరగతుల ప్రజల మద్దతుతో జులై 9న సమ్మెకు సిద్ధమవుతున్నది. 1871 లోనే యూజీనీ పాటియర్ రాసిన అంతర్జాతీయ గీతం ఇవన్నీ ఊహించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

వారి యోగమూ వారల దర్జా
వారి భోగమూ వారల దర్పం
రెక్కల కష్టంబే కాదా
మన రెక్కల కష్టంబే కాదా! ★

> **తెలుగు రాష్ట్రాల్లో భారీ ప్రాజెక్టులు ప్రధానంగా ఒక సంస్థ చేస్తుంటుంది. ఇలాంటి వారు ఇక్కడ ప్రాంతీయ పార్టీలనూ అక్కడ మోడీ సర్కారును ప్రసన్నం చేసుకుంటూనే వుంటారు. దేశ వ్యాపితంగా హైవేలు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చుట్టూనే తిరుగుతుంటాయనేది జాతీయ రహస్యం. ఇక గనులు వనులూ అదాని, అంబానీ, వేదాంత వంటి వారి నిర్వహణలోకి వెళతాయి. కాంగ్రెస్ కాలంలో అంబానీ ప్రధాన పాత్ర వహిస్తే బిజెపి హయాంలో అదాని దూకుడు పెరిగి వుండవచ్చు గానీ వీరైనా వారైనా కార్పొరేట్ చట్రంలో వున్నవారే. మోడీ సర్కారుకు మొదటి రెండుసార్లు పూర్తి మెజార్టీ, ఇప్పుడు కూడా ఆధిపత్యం వున్నందువల్ల మరింత జోరుగా సాగడం సాధ్యమవుతున్నది.**

జో డర్ గయా ! ఓ మర్ గయా !

సుబ్రమణ్యం

ఉదయాన్నే డ్యూటీకి బయల్దేరుతున్నాడు రామారావు. అతగాడి చేతికి కేరేజీ ఇస్తూ భార్య కాంతం దానితోబాటు ఒక కాగితాన్ని కూడా అందించింది. దాన్ని చూడగానే అదిరిపడ్డాడు రామారావు.

" ఏంటే ఇది? ఎలా వొచ్చిందిది ఇక్కడికి ? ఎవరిచ్చారు? " అని వణుకుతున్న గొంతుకతో అడిగాడు.

కాంతానికి అతగాడి భయమేమిటో అర్థం కాలేదు.

"ఏటి బావా అది? అంతలా బయపడిపోతన్నావ్ ? దాన్ని మన ఈదిలో ఉండే సంగం ఆపీసు కుర్రోల్లు ఇచ్చారు. ఏటేనా పెమాదవాఁ ?" అనడిగింది.

"అమ్మో! ఇలాటి కాగితాలతో కనపడితే నా ఉజ్జోగమే ఊడిపోద్ది" అంటూ ఆ కాగితాన్ని అక్కడే నలిపి పారేసి గబగబా సైకిలెక్కాడు రామారావు.

• • •

సాయంత్రం తిరిగొచ్చేసరికి రామారావుకి ఇల్లంతా ప్రశాంతంగానే కనిపించింది. స్నానం చేసి, అన్నం తిని నిద్రకు తయారౌతున్నప్పుడు కాంతం నెమ్మదిగా అడిగింది.

"బావా, ఇప్పుడు సెప్పు, ఆ కాగితాన్ని సూసి పొద్దున్న ఎందుకంత బయపడిపోనావు?"

రామారావుకి పౌరుషం పొడుచుకొచ్చింది. "సెస్ ! బయం అంటావేటే ! ఆ మాదిరి కాగితాలని పట్టుకుని తిరగ్గూడదని మా సూపర్వైజరు సెప్పేడు. శానా గట్టిగా జాగ్రత్తలు సెప్పేడు. అంతా నా మంచికోసవేఁ అని మరీ సెప్పేడు." అని దబాయించేడు.

" కాదులే బావా ! నాను ఆ కాగితంలో ఏటుందోనని మన అబ్బులుగాడితో సదివించుకుని ఇన్నాను. అందులో మల్లొచ్చే బుదోరం నాడు, అదే, తొమ్మిదో తారీకు నాడు సమ్మె చేయాలని ఉంది. దానికే ఇంత జడిసిపోతన్నావేటి?" అని కాంతం రెట్టించింది.

"అట్టాంటి సమ్మెలూ గిమ్మెలూ పనికిరావని, మొండిగా సమ్మెకు గాని దిగితే ఉజ్జోగం నుంచి పీకి పారేస్తారని సూపర్వైజరు సెప్పేడు. అసలు ఆ సంగం వోల్లతో కలిసి తిరిగితే శానా పెమాదమని కూడా జాగ్రత్తలు సెప్పేడు. మరి ఆ ఊసెత్తక " అని అటువైపు తిరిగి దుప్పటి ముసుగు పెట్టేఁశాడు ఒక పక్క ఉక్క పోస్తున్నా.

కాంతం ఆలోచనలో పడింది.

• • •

మర్నాడు ఉదయం రామారావు డ్యూటీకి యథావిధిగా బయలుదేరేడు. అప్పటికి కేరేజీ పట్టుకుని రెడీగా ఉండవలసిన కాంతం ఇంకా వంటగదిలోనే

" నా కేరేజీ ఏదే? " అని కేక పెట్టాడు రామారావు.

సమాధానం లేదు. వంటగదిలోకి తొంగి చూసేడు. అక్కడ పీట మీద కూర్చుని దీర్ఘాలోచనలో ఉంది కాంతం.

" కేరేజీ కట్టకుండా ఏటి సేత్తన్నావు?" అనడిగేడు.

"అసలు వంటే సెయ్యనేదు" అని జవాబిచ్చింది కాంతం.

" ఏటైనాది? ఒంట్లో బాగులేదా?" అడిగేడు రామారావు.

కాదన్నట్టు అడ్డంగా తలూపింది కాంతం.

"మరేటైనాది?" అడిగేడు.

"బయ్యం" అంది కాంతం. రామారావుకి అర్థం కాలేదు.

"వంట సెయ్యడానికి బయవేఁటే? రోజూ సేత్తున్నావు కాదా?" అడిగేడు.

" గేసు బండ పేలిపోద్ది" అంది కాంతం తాపీగా.

'ఎవర్తే నీకలా సెప్పింది" ? అనడిగేడు.

" మా సూరేకాంతం అత్త. గేసు పొయ్యి దగ్గరకెల్లొద్దంది. దాంతో నాకు బయం పట్టుకుంది."

రామారావుకి బోధపడలేదు. "మరిప్పుడు తిండి ఎలాగే ?" అడిగేడు.

"నువ్వు వోటల్లో తినేసి, నాకూ పార్సిలట్రా" అంది కాంతం.



"ఇన్నాళ్ళూ లేని బయం ఇప్పుడెందుకే?" అన్నాడు రామారావు.

"అద్సరేగాని, ముందిది సెప్పు. నువ్వు శానా సార్లు డూటీలు ఎగ్గొట్టినావు కదా? అప్పుడేటైనాది? ఎగ్గొట్టిన రోజుకి జీతం కోత పెట్టారు. అంతే కదా. దానికి నువ్వు బయపడనేదు. మరిప్పుడు బుదోరం డూటీ మానెయ్యమంటే ఎందుకు బయపడతన్నావు? నీ సూపర్వైజరుగాడెవడో నిన్ను బయపెట్టేడు కాబట్టి బయపడతన్నావు. నానూ అలాగే మా యత్త బయపెడితే బయపడతన్నాను. ఇంతకీ నువ్వు ఆ సంగం వోల్లు ఇచ్చిన కాగితంలో ఏముందో సదవడానికే దైర్నం సెయ్యలేకపోతున్నావు. ఎందుకు?" అంది కాంతం.

ముఖాన్ని తిప్పేసుకుని మాట్లాడకుండా డ్యూటీకి సైకిలెక్కాడు రామారావు.

• • •

సాయంత్రం రామారావు తిరిగి వచ్చేసరికి కాంతం ఇంటి దగ్గర లేదు. ఎక్కడికి పోయిందబ్బా అని అనుకుంటూ వుంటే నెమ్మదిగా వచ్చింది.

"ఎక్కడికి పోనావు?" అడిగాడు.

"మన ఈదిలో లచ్చిమి ఇంటి దగ్గర గొడవైతే ఎల్లాను" అంది.

"ఈదిలో గొడవలు మనకెందుకే ? ఇంతకీ ఏటా గొడవ ?" అన్నాడు.

" దానికి పిల్లల్ని కనడం అంటే బయ్యం అంటోంది" అని విషయం చెప్పింది కాంతం.

"మరి మొగుడూరుకున్నాడా?" అడిగేడు రామారావు.

"ఊరుకోక ఏటి సేత్తాడు? అందరి ముందూ కరాకండిగా సెప్పేసింది అది. నీకు ఒకరోజు సమ్మె సెయ్యడానికే బయం కదా? మరి నేను నా పేనాన్ని పణంగా పెట్టి మరీ పిల్లల్ని ఎందుకు కనాల?" అని మొగుడిని నిలేసింది. దాంతో దాని మొగుడు అప్పారావు తనకి బయం నేదని, తొమ్మిదో తారీకున సమ్మె సేత్తానని, జెండా పట్టుకుని అందరికన్నా ముందు నిలబడతానని సెప్పేడు. నువ్వా ఉన్నావు ఎందుకు?" అని ఈసడించింది కాంతమ్మ.

వంట చెయ్యడం దగ్గర ఉదయం మొదలైన గాలివాన సాయంత్రానికి వాయుగుండంగా మారి ఏకంగా పిల్లల్ని కనేది లేదన్నంత దాకా వచ్చిందని రామారావుకి అర్థం అయింది. రోడ్డు మీదకి వచ్చేడు.

> **" దానికి పిల్లల్ని కనడం అంటే బయ్యం అంటోంది" అని విషయం చెప్పింది కాంతం. "మరి మొగుడూరుకున్నాడా?" అడిగేడు రామారావు. "ఊరుకోక ఏటి సేత్తాడు? అందరిముందూ కరాకండిగా సెప్పేసింది అది. నీకు ఒకరోజు సమ్మె సెయ్యడానికే బయం కదా? మరి నేను నా పేనాన్ని పణంగా పెట్టి మరీ పిల్లల్ని ఎందుకు కనాల?" అని మొగుడిని నిలేసింది. దాంతో దాని మొగుడు అప్పారావు తనకి బయం నేదని, తొమ్మిదో తారీకున సమ్మె సేత్తానని, జెండా పట్టుకుని అందరికన్నా ముందు నిలబడతానని సెప్పేడు. నువ్వూ ఉన్నావు ఎందుకు?" అని ఈసడించింది కాంతమ్మ.**

అక్కడ అప్పారావు గట్టిగా అంటున్నాడు "మనం బయపడేది ఇంట్లో ఆడోల్ల కోసం, మన కుటమానం కోసవేఁ కదా? కాని ఆల్లే బయపడకుండా ఉన్నప్పుడు మనకి బయం ఎందుకు? ఏదైతే అదవుద్ది. తొమ్మిదో తారీకునాడు మనం కట్టగట్టుకుని సమ్మె సేద్దాం. "

అప్పుడే అక్కడికి వచ్చిన సంఘం కార్యకర్త సత్యం " ఒక్కటే మాట చెప్తాను వినండి! మనం ఎప్పుడైతే భయపడడం మానేస్తామో అప్పుడే యజమానుల గుండెల్లో భయం మొదలౌతుంది. ఆ భయం పోలీసుల లాఠీలకూ, ప్రభుత్వానికీ కూడా పాకుతుంది. అప్పుడే మన సమస్యల్ని వాళ్ళు పట్టించుకుంటారు. మంచితనం ఒక్కటే సరిపోదు. మనకి దానికి తోడు ధైర్యం కూడా ఉండాలి. " అన్నాడు.

"జులై తొమ్మిది సమ్మె జయప్రదం చేద్దాం" అన్నాడు రామారావు గట్టిగా కాంతానికి వినపడేలా.

వీధిలో "కార్మిక ఐక్యత వర్ధిల్లాలి. పోరాడి తీరుతాం, సాధించి తీరుతాం" అంటూ నినాదాలు మార్మోగుతున్నాయి. రామారావు ఇంట్లో పొయ్యి మీద చారు తాలింపు ఘుమఘుమలాడుతోంది. ★

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గణపవరం (పశ్చిమగోదావరి జిల్లా)

గణపవరం డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కాలేజీలో బిఎస్‌సి విద్యార్థులకు బోధన చేయుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అభ్యర్థి సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పిజి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలని, పిహెచ్‌డినెట్ లేదా ఎస్ఇటి బోధనానుభవం కలిగినవారికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 14వ తేదీలోపు అన్ని సర్టిఫికెట్‌లతో కళాశాలలో అందజేయాలని, మరిన్ని వివరాల కోసం 7901056668 నెంబర్‌కి ఫోన్ చేయాలని తెలియజేశారు.



నందిగామ మండలం సోమవరం గ్రామంలో డ్రైయినేజీ పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా 'మ్యాజిక్ డ్రెయిన్'

- విస్తృత విధానంతో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - నందిగామ (ఎన్‌టిఆర్) : భూగర్భ జలాల పెంపు, మురుగునీటి సమస్యల పరిష్కారం లక్ష్యంగా చేపట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్' డ్రెయినేజీ వ్యవస్థలో గేమ్ చేంజర్‌గా మారనుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రవేశపెడుతున్న మ్యాజిక్ డ్రెయిన్ విధానాన్ని శనివారం నందిగామ మండలం సోమవరం గ్రామంలో కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సాంప్రదాయ కాంక్రీట్ ఛానల్ (సిసి) డ్రెయినేజీ వ్యవస్థ మాదిరిగా కాకుండా గృహాల నుంచి విడుదలయ్యే మురుగునీరు ప్రత్యేకంగా రూపొందించిన కందకం ద్వారా నేరుగా భూమిలోకి చొప్పుకుపోయే అవకాశం ఉంటుందన్నారు. 100 మీటర్ల సిసి డ్రెయిన్ నిర్మాణానికి దాదాపు రూ.4,000 ఖర్చవుతుందని, అదే వంద మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.1000 ఖర్చుతో పూర్తి చేయవచ్చన్నారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ నమూనా విజయవంతమైతే జిల్లాలోని అన్ని గ్రామాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఎ.రాము, ఎపిడి కె.శ్రీనివాసరావు, ఎపిఒ ఎ.శరత్‌బాబు, ఎంపిడిఒ కె. శ్రీనివాసరావు, తహశీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా పురోగతికి శ్రమించాలి

- పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, అధికారులు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విద్యాశాఖ ప్రాంతీయ, జిల్లా, ఇతర అధికారులతో విజయవాడలోని సమీక్షా సమావేశం నిర్వహించారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 మార్గదర్శకాలను డైరెక్టర్ వివరించారు. పాఠశాల-సమాజం భాగస్వామ్యాన్ని పెంపొందించ జరపుకోవాలని చెప్పారు. అన్ని పాఠశాలల్లో పిల్లల విద్యా పురోగతి గురించి తల్లిదండ్రులను చర్చల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, అలాగే పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంఘం నాయకులను ఆహ్వానించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, జిల్లా, మండల స్థాయిలో పనితీరును, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాలు, అసెస్‌మెంట్ బుక్‌లెట్ల వినియోగం, బ్రిడ్జ్ కోర్సులు, రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్ సమావేశాల పురోగతిని సమీక్షించి లోతైన విశ్లేషణ చేశారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి

- మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారం కోల్పోయిన వైసిపి నాయకులు రాష్ట్రంలో అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో గుంటూరు జిల్లాలో టిడిపి నాయకులపై దాడులు చేయించి అక్రమ కేసులు పెట్టించిన చరిత్ర. దీనివల్ల అనేక మంది గ్రామాలు వదిలి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని విమర్శించారు.

మామిడి రైతుల కష్టాలను వైసిపి నాయకులు రాజకీయంగా ఉపయోగించుకున్నారని టిడిపి నేత, అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మరో సమావేశంలో విమర్శించారు. వైసిపి నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మామిడి రైతుల కష్టాలను దోచుకునే ప్రయత్నం చేస్తూ తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రీవెన్స్ నిర్వహించిన 'కంభంపాటి'

టిడిపి కార్యాలయంలో రాజ్యసభ మాజీ సభ్యులు కంభంపాటి రామ్మోహన్‌రావు గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమిని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు ఆక్రమించుకున్నారని కృష్ణా జిల్లా బండారుగూడెనికి చెందిన పావులూరి సుబ్బారావు ఫిర్యాదు చేశారు.



గత 70 ఏళ్లుగా భారత్‌లోనే టిబెటన్ల జీవనం

- అంతంతమాత్రంగానే విద్య, వైద్యం
- అందని ప్రభుత్వ సహకారం

న్యూఢిల్లీ : వేలాది టిబెటన్లు గత 70 ఏళ్లగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వారు జీవిస్తున్నారు. తమ వంటకాలు, వైద్యం, సంస్కృతితో భారత సమాజంలో అంతర్భాగమయ్యారు. భారత్‌కు శరణార్థులకు ఆశ్రయం కల్పించడంలో గొప్ప చరిత్ర ఉంది. 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో లక్షలాది మందికి ఆశ్రయం కల్పించిన భారత్ టిబెట్ శరణార్థులను అక్కున చేర్చుకుంది. ఎంతో కాలం నుండి నివసిస్తున్నప్పటికి రోజువారీ జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారు స్వేచ్ఛగా ప్రయాణించడానికి పరిమితులున్నాయి. చాలా మందికి ఆస్తులు లేవు, బ్యాంకు రుణాలకు ఆంక్షలున్నాయి. విద్య, వైద్య సదుపాయాలు తక్కువ. ప్రభుత్వం దృష్టి పెడితే వారి జీవన పరిస్థితులను మెరుగుపరచవచ్చు. 1950 నుండి భారత్‌లో శాంతియుతంగా జీవిస్తున్న టిబెటన్లకు భారతీయుల మద్దతు అవసరం. ప్రభుత్వం వారికి మరింత సహకారం అందించాలి, తద్వారా వారు తమ సంస్కృతి, జీవనోపాధిని కాపాడుకోవడంతోపాటు భారత సమాజంలో మరింత భాగస్వామ్యం కాగలరని పలువురు కోరుకుంటున్నారు.

వ్యవసాయ కార్పొరేటీకరణను నిలువరించేందుకు

ఐక్య ఉద్యమాలే ఏకైక మార్గం

- ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు అమ్రారామ్

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ, నెల్లూరు నగరం

ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, రాజస్థాన్‌కు చెందిన పార్లమెంట్ సభ్యులు అమ్రారామ్ పిలుపునిచ్చారు. ఇందుకు రైతాంగ ఐక్య ఉద్యమాలే ఏకైక మార్గమని వివరించారు. 'కార్పొరేటీకరణ-వ్యవసాయ రంగంపై ప్రభావం' అనే అంశంపై ఎపి రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఒంగోలు, నెల్లూరుల్లో శనివారం జరిగిన సెమినార్‌ల్లో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం ఢిల్లీలో రైతు సంఘాల ఐక్య ఉద్యమంతో సాగిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులు శాంతియుతంగా తమ ఆందోళన తెలుపుకునేందుకు ఢిల్లీకి రానీయకుండా అత్యంత పాశవికంగా పోలీస్ బలగాలతో అడ్డుకునే ప్రయత్నం చేసినా, కేంద్ర మంత్రి తనయుడు కారుతో రైతులను కిరాతకంగా తొక్కించి ప్రాణాలు తీసినా, తుపాకీలతో కాల్పులు జరిపి వందలమంది అన్నదాతల ప్రాణాలు తీసి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా రైతాంగం సంయమనం పాటించి నల్ల చట్టాలను వెనక్కి తీసుకునేలా పోరాడటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రకాశం జిల్లాలో రైతుల ఉద్యమం వల్ల రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్న అంశాన్ని ప్రస్తావించి జిల్లా రైతాంగ ఉద్యమానికి అభినందనలు తెలిపారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తోందన్నారు. రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, పరిశ్రమలను, విద్యుత్తును కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని, వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు కట్టపెట్టే యత్నాలను ప్రారంభించిందని వివరించారు. దేశంలోని నలుగురు పారిశ్రామిక వేత్తలకు సంపదను దోచిపెట్టే రీతిలో బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రైతాంగాన్ని ఆదుకునే రీతిలో బడ్జెట్లో నిధులు కేటాయించలేదని తెలిపారు. ఇప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో రైతుల నుంచి భూ సేకరణ చేశారన్నారు. ఆ భూముల్లో పరిశ్రమలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు కాక రైతాంగం ఆందోళన చెందుతున్న ఈ తరుణంలో అమెరికాతో వ్యవసాయ ఒప్పందం రైతాంగానికి చేటు తెస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా ఈ నెల తొమ్మిదో తేదీ రైతాంగం దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అనేక మంది రైతులు గిట్టుబాటు ధర రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లను తగులబెట్టండని పాదయాత్రలో లోకేష్ మాట్లాడారని, ఇప్పుడు అదే మీటర్లను ఆయన ప్రోత్సహించడం తగదన్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో పలువురు రైతులు స్మార్ట్ మీటర్లతో తమకు నష్టం వాటిల్లుతోందని ఆగ్రహించి వారిని తగలబెట్టారని తెలిపారు. వారిపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. ఒంగోలులో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరు జయంతిబాబు, నెల్లూరులో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్ అధ్యక్షత వహించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు అమ్రారామ్

ఎండైనా..వానైనా.. బయటే భోజనాలు

- బొమ్మనహాల్ కస్తూరిబాలో విద్యార్థినుల అగచాట్లు



ప్రజాశక్తి- బొమ్మనహాల్

ఎండ అయినా.. వాన వచ్చినా.. ఆరుబయట భోజనాలు చేయాల్సిందే... లేదంటే పస్తుండాల్సిందే.. ఎక్కడో కాదు బొమ్మనహాల్ మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల హైస్కూలలో విద్యార్థినుల పరిస్థితి. ఇక్కడ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలతోపాటు జూనియర్ కళాశాల కూడా ఉంది. రెండూ ఒకే భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఇందులో దాదాపు 80 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వీరందరూ ఉదయం, రాత్రికి భోజనమైనా.. అల్పాహారమైనా ఆరుబయట చేయాల్సిందే. ఎందుకంటే విద్యార్థినులకు ప్రత్యేకంగా భోజనం చేసేందుకు హాలు లేదు. ఎండ అయితే అలాగే కూర్చొని తింటారు. అదే వర్షం వచ్చిందంటే మాత్రం వర్షం నిలిచిపోయే వరకూ వేచి చూడాల్సిందే. వీటికితోటు మరుగుదొడ్లు కూడా తక్కువగా ఉండటంతో క్యూలో నిలబడాల్సిన దుస్థితి. ఇందుకోసం తెల్లవారుజామునే లేవాల్సి వస్తుందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కస్తూరిబాలో ప్రత్యేక భోజనశాల ఏర్పాటు చేయడంతోపాటు మరిన్ని మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విషయంపై స్పెషల్ ఆఫీసర్ కమలమ్మ వివరణ కోరగా అలాంటిదేమీ లేదని దాటవేశారు.

కలుషిత నీరు తాగి ఐదుగురికి అస్వస్థత

ప్రజాశక్తి-గుంతకల్లు

అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని 11వ వార్డు తిలక్‌నగర్ సాయికృష్ణ ఆసుపత్రి వెనుక కాలనీలో కొళాయిల నుంచి వచ్చిన కలుషిత నీరు తాగి ఐదుగురు స్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. 11వ వార్డులోని సాయికృష్ణ ఆసుపత్రి వెనుక కాలనీలో శనివారం ఉదయం మున్సిపల్ సిబ్బంది కొళాయిలకు నీరు వదిలారు. కొళాయిల్లో రంగుమారి, దుర్వాసనతో నీరు వచ్చింది. ఆ నీటిని తాగిన కాలనీకి చెందిన వనజ, స్వాతి, గీత, దీపిక, భారత్‌కి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌ను వివరణ కోరేందుకు చరవాణి ద్వారా ప్రయత్నించగా స్పందించలేదు. విషయం తెలుసుకున్న సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, కమిటీ సభ్యులు రామునాయక్, షబ్బీర్, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఆనంద్, సిపిఐ నాయకులు మహేష్, గౌస్, రామాంజినేయులు, ఈశ్వరయ్య తదితరులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని డ్యూటీ డాక్టర్ సల్మాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ నెలరోజుల నుంచి కొళాయిల్లో బురద, మట్టితో కూడిన నీరు వస్తోందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను కలుపుకుని సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పాములా మెలికలు తిరిగిన వంతెన

మధ్యప్రదేశ్‌లో బిజెపి సర్కార్ అభాసుపాలు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇటీవల 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అంతలోనే అక్కడికి దగ్గర్లోని సుభాష్‌నగర్‌లో నిర్మించిన పాములా మెలికలు తిరిగిన రైల్వే ఓవర్ బ్రిడ్జి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాని నిర్మాణంలో ఇంజినీరింగ్ వైఫల్యం కారణంగా ఎనిమిది గంటల్లో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఉదంతాలతో బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ అభాసుపాలైంది. రూ.40 కోట్లతో ఈ వంతెనను నిర్మించినట్లు తెలుస్తోంది. భోపాల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది.

ఈ వంతెన వల్ల సుభాష్ నగర్ ప్రాంతంలో రద్దీ తగ్గినప్పటికీ దాని నిర్మాణం పలుచోట్ల మెలికలు తిరిగి ఉండడం వల్ల కొన్ని సెకన్లలోనే పలుమార్లు మలుపులు తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనివల్ల రాత్రి సమయాల్లో, అధిక వేగంతో ప్రయాణించే వాహనదారులు మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి.. ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో పల్టీలు కొట్టిందని.. మరోసారి ఓ స్కూల్ వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టడంతో అందులోని విద్యార్థులకు గాయాలయ్యాయన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా వెంటనే తగిన చర్యలు తీసుకొని.. మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రాజధాని భోపాల్‌లో ఐష్‌బాగ్ వద్ద రూ.18 కోట్లతో ఇటీవల కొత్తగా ఓ రైల్వే వంతెన నిర్మించారు. అయితే, అది 90 డిగ్రీల మలుపు కలిగి ఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇలాంటి డిజైన్‌లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు దుయ్యబట్టారు. నిర్మాణ సంస్థ మాత్రం ఆ డిజైన్‌ను సమర్థించుకుంది. సమీపంలో మెట్రో రైల్‌స్టేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్ప మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది. కొంచెం అదనపు భూమి అందుబాటులో ఉంటే ఆ మార్గం సవ్యంగానే ఉండేదని చెప్పింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు విధించింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌పై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. వంతెన పునరుద్ధరణ కోసం ఓ కమిటీని సైతం ఏర్పాటుచేసినట్లు ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ వెల్లడించారు.



'ఘాటి' మళ్లీ వాయిదా

అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన 'ఘాటి' సినిమా ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. డైరెక్టర్ క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా వాయిదా పడి, జులై 11వ తేదీన రిలీజ్‌కు రెడీ అవుతోంది. అయితే, ఆ రోజు కూడా రిలీజ్ చేయడం లేదని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. సినిమా అనేది ఒక నది లాంటిది. ఒక్కోసారి అది వేగంగా పరిగెత్తుతుంది. ఒక్కో సారి లోతు పెంచుకోవడం కోసం నిలకడగా ఉండిపోతుంద'ని ఈ ప్రకటనలో ప్రస్తావించారు. సినిమాలో ప్రతి ఫ్రేమ్‌ను అద్భుతంగా మార్చేందుకు మేము ఇంకా సినిమాను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నామని, సినిమా మీద ఉన్న మీ ప్రేమకు, మీ సహనానికి కృతజ్ఞతలు' అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో, అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజీవ్ రెడ్డి, సాయిబాబా గుడి నిర్మిస్తున్నారు. విద్యాసాగర్ సంగీతం అందిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు.

ఆసక్తికరంగా 'ఓ భామ.. అయ్యో రామ' ట్రైలర్

సుహాస్ తాజాగా నటిస్తున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో నటి మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడారు. 'ఇటీవల విడుదలైన ప్రతి ప్రమోషన్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఓ క్వాలిటీ సినిమాను ప్రేక్షకులకు ఇవ్వడానికి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత హరీష్ ఈ చిత్రాన్ని రాజీపడకుండా నిర్మించారు. ప్రొడక్ట్ క్వాలిటీగా రావడానికి ఆయనే కారణం. మణికందన్ ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు. రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరుపాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గా ఉంటాయి' అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నారు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్ని సమాకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.



పూలింగు ప్రకటనతో ఆవేశం.. ఆవేదన

- రాజధాని పరిధిలో రైతుల పరిస్థితి
- మా పరిస్థితి ఏమిటంటూ గత రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో రెండోదశ పూలింగు ప్రకటన రావడంతో గతంలో భూములిచ్చిన రైతుల్లో ఆందోళన మొదలైంది. రెండోదశ పూలింగు విస్తరించిన ప్రాంతాల్లో రైతులు కూడా గతంలో భూములిచ్చిన వారికి న్యాయం చేయాలని కోరుతున్నా ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళుతోంది. అప్పులు తెచ్చిన నిధులతో చేపడుతున్న పనులూ పరిపాలనా భవనాలకు మాత్రమే పరిమితం అయ్యాయని, లేఅవుట్ల అభివృద్ధి జోలికి వెళ్లడం లేదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పూలింగు ప్రక్రియతో అధికార, పాలనా యంత్రాంగం మొత్తం ఈ ఏడాదంతా అటువైపే ఉంటుందని గత పూలింగు ఏరియాను పట్టించుకోరని, 11 ఏళ్లయినా ఒక్క అడుగూ ముందుకు పడలేదనే బాధ వారిని వేధిస్తోంది. 2015 జనవరి ఒకటోతేదీ నుండి పూలింగు మొదలుపెట్టిన ప్రభుత్వం ఇప్పటి వరకూ రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయలేదు. అసలు ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తించలేని విధంగా ఈ ప్రాంతం తయారైంది. ముళ్ల పొదల తొలగింపు పేరుతో సరిహద్దు రాళ్లన్నీ ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో మరోసారి సర్వేచేసి రాళ్ల వేయాల్సిన పరిస్థితి ఉంది. రోడ్లు వేయలేదు. రైతులు స్వచ్ఛంధంగా అభివృద్ధి చేసుకునే అవకాశమూ ఇవ్వలేదు. పూలింగు ఇచ్చిన తరువాత మూడేళ్లలో భూములను అభివృద్ధి చేసి తిరిగి ఇస్తామని చట్టంలో పేర్కొన్నప్పటికీ ఇప్పటికీ ఒక్కగజం కూడా అభివృద్ధి చేయలేదు. ప్రభుత్వం మారిందనుకుని సంబరాలు చేసుకున్న ఉత్సాహాన్ని ఈ ప్రభుత్వం ఎక్కువకాలం నిలవనీయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పూర్తయినా రాజధాని ప్రస్తావన నిర్మాణాలకే పరిమితమైంది. మరోవైపు భూముల ధరలు తగ్గుతున్నాయి. పూలింగు విస్తీర్ణం పెరగడంతోపాటు అటువైపే ఎయిర్‌పోర్టు నిర్మాణం, ఐటి కంపెనీలకు అక్కడే భూములిస్తారనే వార్తలతో తమ భూముల విలువ కోల్పోతాయనే భయం రైతులను వెంటాడుతోంది. నమ్మి భూములిచ్చినా ప్రభుత్వం సరైన న్యాయం చేయలేదనే భావన ఆ ప్రాంత రైతుల్లో ఎక్కువగా ఉంది. రెండోదశ పూలింగు ప్రకటనతో వారిలో ఆందోళన తీవ్రస్థాయికి చేరింది. శనివారం సాయంత్రం దీనిపైనే రాజధాని గ్రామాల్లో పెద్దయెత్తున చర్చ జరిగింది. తమకు అన్యాయం జరుగుతోందనే భావన వారిలో వ్యక్తమైంది. ముఖ్యంగా టిడిపి నాయకుల్లోనూ తీవ్ర నిరుత్సాహం వ్యక్తమవుతోంది.



గుంటూరు జిల్లా తాడికొండ మండలం బేజాత్‌పురం సభలో భూ సేకరణపై అభ్యంతరం చెబుతున్న రైతులు (ఫైల్ ఫొటో)

శేఖర్ కమ్ములతో సమంత





కుబేరతో మంచి విజయాన్ని అందుకున్నారు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం మరో కొత్త సినిమాపై కేంద్రీకరించారు. తన కొత్త ప్రాజెక్టు లవ్‌స్టోరీతో ఉంటుందని గతంలోనే శేఖర్ కమ్ముల ప్రకటించిన విషయం తెలిసిందే. అది సమంతతో ఉండబోతోందనే చర్చ బలంగా వినిపిస్తోంది. సమంత ప్రధాన పాత్రలో లేడీ ఓరియంటెడ్ స్టోరీతో ఈ చిత్రం ఉంటుందట. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని చెబుతున్నారు.

వెండితెరపై క్రికెటర్ రైనా

టీమిండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వెండితెరపై సందడి చేయనున్నారు. క్రికెట్ నేపథ్యంలో రానున్న తమిళ చిత్రంతో తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. ఈ చిత్రానికి లోగన్ దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ నైట్ స్టోరీస్ నిర్మాణ సంస్థలో శ్రవణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి కాగా, త్వరలోనే షూటింగ్ ప్రారంభమవుతోంది. క్రికెటర్లు సినిమా రంగంలో అడపాదడపా తమ ప్రతిభ చాటుకుంటూనే ఉన్నారు. 2022లో విక్రమ్ హీరోగా వచ్చిన 'కోబ్రా'లో ఇర్ఫాన్ పఠాన్.. ఇంటర్ పోల్ అధికారి పాత్రలో కనిపించాడు. 'ఫ్రెండ్‌షిప్' చిత్రంలో కన్నడ నటుడు అర్జున్‌తో కలిసి హర్భజన్ సింగ్ అలరించారు. శిఖర్ ధావన్ ఇప్పటికే బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ధోనీ తన నిర్మాణ సంస్థలో 'లెట్స్ గెట్ మ్యారీడ్' మూవీని రూపొందించారు.



గందరగోళంగా బీహార్ ఓటర్ల జాబితా సవరణ

- ఇసి రివిజన్‌లో అనేక లోపాలు
- ప్రతిపక్షాల ఆందోళన

పాట్నా : బీహార్ ఓటర్ జాబితా ప్రత్యేక రివిజన్ గురించి ఎన్నికల కమిషన్ (ఇసి) గొప్పగా చెబుతున్నా సాధారణ ఓటర్లను గందరగోళంలో పడేసింది. ఎన్నికల నిర్వహణకు కొన్ని నెలల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ఇసి దీన్ని వేగవంతం చేయడంతో అయోమయం నెలకొందని , ఆచరణలో సాధ్యంకాదని ప్రతిపక్షాలు ఆందోళనవ్యక్తం చేస్తున్నాయి..

సరైన సమయంచీశీఅవగుం కాదు

బీహార్ వరద ప్రభావిత ప్రాంతం. సీజన్ ప్రారంభంలోనే ముమ్మరంగా వర్షాలు పడుతున్నాయి. హడావిడిగా తయారు చేసిన షెడ్యూల్ వల్ల , వరదలతో ఇబ్బంది పడే ఈ సమయంలో ఇలాంటి రివిజన్ చేపట్టడం సరైనది కాదని, సామాన్యులకు ఇబ్బంది కలిగిస్తుందని, కార్యకర్తలు ఒత్తిడికి గురౌవుతారని రాజకీయ పక్షాలు అంటున్నాయి. అదే సమయంలో వీటిలో తప్పులుదొర్లితే రాజకీయంగా భారీ నష్టం కలుగుతుందని, దానికి ఎవరు భాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

అనేక సమస్యలు


బూత్ లెవల్ అధికారి (బిఎల్‌ఓ) ప్రతి ఓటర్ ఇంటికి చాలాసార్లు వెళ్లాల్సి ఉంటుంది. ఖాళీ ఫారం ఇవ్వడానికి, తర్వాత దానికి సరైన పత్రాలు జతచేయడానికి, అవి ధృవీకరించుకోవడానికి, ఆయా దరఖాస్తులను పరిశీలించడానికి పలుమార్లు తిరగాల్సి ఉంటుంది. మరోవైపు బీహార్లో డాక్యుమెంటేషన్ సరిగ్గా లేనందున పత్రాలు సేకరించడం అత్యంత కష్టం. ఇక ఓటర్ తన ఫారం, పత్రాలను బిఎల్‌ఓ కు ఇవ్వలేకపోతే, వారిని కొత్త ఓటర్ జాబితాలో చేర్చరు. బి ఎల్ ఒలు దాదాపు 7 కోట్ల ఓటర్లకు సంబంధించిన డాక్యుమెంట్లను వారంలోనే సేకరించి, వెరిఫై చేసి, సర్టిఫై చేసి, స్కాన్ చేసి అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇదంతా పూర్తైన తరువాత ఆగస్టు 1న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి, అభ్యంతరాలు, ఫిర్యాదులకు ఒక నెల సమయం ఇస్తారు. బీహార్‌లో వలస కార్మికులు ఎక్కువ. తమ జీవనోపాధికోసం రాష్ట్రాలు దాటి వెళ్తారు. వారు తమ పనిని వదిలి ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో పని మానుకుని జూలైలో బిఎల్‌ఓల కోసం స్వస్థాలకు చేరుకోవాలి. వారిని తొలగిస్తే ఆగస్టులో మళ్లీ అందుబాటులో ఉండాలి. ఇది అచరణలో ఎలా సాధ్యపడుతుందని, ఇన్ని ప్రతిబంధకాల మధ్య సెప్టెంబర్ 30 లోపు తుది ఓటర్ల జాబితా సిద్ధం కాగలదా అని, ఇసి నిర్ణయం సమస్యలను పరిష్కరించక పోగా మరింత జటిలం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.


పాట్నాలో సవరణల దరఖాస్తులతో వేచిచూస్తున్న ఓటర్లు (ఫైల్)

ఆధిపత్యం కోసమే అమెరికా జిత్తులు

సామ్రాజ్యవాదం ప్రపంచానికి ముప్పు

'ద హిందూ' ఇంటర్వ్యూలో ప్రకాశ్ కరత్



న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య 12 రోజులుగా యుద్ధం సాగుతున్న సమయంలో ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా దాడులకు పాల్పడింది. ప్రజా విధ్వంసక ఆయుధాలు వున్నాయనే సాకుతో ఇరాక్‌ను అక్రమంగా ఆక్రమించుకోవడం, ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించుకోవడంతో సహా ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఏకపక్షంగా సాగించే మిలటరీ జోక్యాలు, ఆపరేషన్ల క్రమంలో ఇరాన్‌పై ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా చేపట్టిన ఈ దాడి తాజాది. ఈ నేపథ్యంలో అమెరికా అనుసరిస్తున్న విధానాలు, దాని వెనుకున్న వ్యూహాలపై 'ద హిందూ' వార్తా సంస్థ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ పలు అంశాలు వెల్లడించారు. ఆ వివరాలు..

ఇటువంటి పరిస్థితుల్లో అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచానికి ముప్పుగా వుందా? ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారం చేపట్టిన తర్వాత అమెరికా తన సామ్రాజ్యవాద ఎజెండాను అమలు చేస్తోందా, ఒకవేళ అదేగనుక అయితే, ఎలా ?

ప్రకాశ్ కరత్ : అవును. అమెరికా ఆధిపత్యం క్షీణించడమే అధ్యక్షుడు ట్రంప్ చేపట్టిన ఈ చర్యలకు నేపథ్యంగా వుంది. పైగా నయా ఉదారవాదం సంక్షోభం అమెరికాను, ప్రపంచాన్ని బాగా ప్రభావితం చేస్తోంది. తాను అనుసరిస్తున్న 'అమెరికా ఫస్ట్' విధానంతో ట్రంప్ తన మిత్రదేశాలకు కూడా ఊపిరాడకుండా చేస్తున్నారు. అమెరికా ఆధిపత్యాన్ని, గుత్తాధిపత్యాన్ని పునరుద్ధరించాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇది ఆయనకు చాలా ముఖ్యమైన అంశంగా వుంది.

పునరుత్పాదక ఇంధన వనరులు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో చైనా పురోగతి సాధిస్తున్నందున అమెరికా ఆధిపత్యానికి ముప్పు ఏర్పడిందని మీరు భావిస్తున్నారా?

ప్రకాశ్ కరత్ : అమెరికా అధికారం క్షీణించడానికి ప్రధాన కారణం చైనా ఎదుగుదలే-అంటే చైనాకు గల ఆర్థిక సామర్థ్యాలు, సాంకేతిక పురోగతి, అంతర్జాతీయంగా గల రాజకీయ ప్రాబల్యం ఇవన్నీ అందుకు దోహదపడే అంశాలే. ట్రంప్ ఇప్పుడు చేస్తున్న ప్రయత్నాలు ఆయనతోనే ప్రారంభం కాలేదు. ఒబామా, బైడెన్ అధ్యక్షులుగా వున్న సమయంలోనే, చైనా నుండి ఈ వ్యూహాత్మక ముప్పును ఎదుర్కొనడంపై అమెరికా దృష్టి పెట్టింది. అందువల్ల చైనా ఎదుగుదలను ఒక ముప్పుగా అమెరికా కచ్చితంగా చూస్తోంది.

అమెరికా పాలక వర్గానికి చైనా ముప్పును ఎదుర్కొనడం మరోసారి కీలక అంశంగా మారింది. ప్రారంభ దాడే ఈ సుంకాల యుద్ధం. అయితే, చైనా చాలా దృఢంగా నిలబడి, టారిఫ్ బెదిరింపులకు లొంగకపోవడంతో అమెరికా దాన్ని అలా కొనసాగించడం కష్టంగా భావిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ఇక తన దృష్టిని ఆసియా పసిఫిక్ ప్రాంతానికి మళ్ళిస్తుందని అనుకుంటున్నాను. రాబోయే రోజుల్లో అమెరికా, చైనా మధ్య శత్రుత్వం కీలకమైన అంశాల్లో ఒకటి కానుంది. చైనా ఎదుగుదల ఒక్కటే ప్రత్యామ్నాయ ధృవం. చైనాను ఎలాగైనా అణగదొక్కడానికి అమెరికా ఏదో ఒకటి ప్రయత్నిస్తూనే వుంటుంది.

ఎదుగుతున్న ఇతర ప్రాంతీయ శక్తులకు ద్వి ధృవ లేదా బహుళ ధృవ ప్రపంచ వ్యవస్థ ఎలా వుంటుంది ?

ప్రకాశ్ కరత్ : బహుళధృవ ప్రపంచం ఎదగడం, అందులో మనం మన వంతు పాత్ర పోషిస్తూ వుండడం భారత్‌కు మంచిగా వుంటుంది. కానీ వాస్తవం ఏమంటే, క్వాడ్, ఇతర ఆర్థిక రక్షణ సంబంధాల ద్వారా భారత్, అమెరికాతో మరింత పొత్తును పెట్టుకుంది. మనం మరింత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కలిగి వుండి, వ్యూహాత్మక ప్రతిపత్తిని నిలుపుకున్నట్లైతే, ఈ పెరుగుతున్న బహుళ ధృవ ప్రపంచం యొక్క పూర్తి అవకాశాలను మనం ఉపయోగించుకోగలుగుతాం. అయితే, అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా ఇరాన్‌పై అమెరికా బాంబు దాడి చేసినప్పటికీ ఆ దాడులను ఖండించడానికి భారత్ తిరస్కరించింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) చేసిన ప్రకటనకు కూడా భారత్ దూరంగా ఉంది. అమెరికా, ఇజ్రాయిల్‌తో మనం అంటకాగుతున్నామని దీంతో స్పష్టమైంది. ఈ పరిస్థితుల్లో ఈనాటి ప్రపంచంలో పెరుగుతున్న బహుళ ధృవ ప్రపంచానికి గల అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకునే పరిస్థితిలో మనం లేం.

అమెరికాతో భారత్‌కు అంత సన్నిహిత సంబంధాలున్నప్పటికీ, పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్‌తో ఘర్షణ నెలకొన్న సమయంలో భారత్, పాక్‌ల మధ్య ఘర్షణలను పరిష్కరించడానికి అమెరికా జోక్యం చేసుకుందని ట్రంప్ చెప్పారు. పాకిస్తాన్‌ను ఒక మిత్రపక్షంగా అమెరికా ఎలా చూసిందో అలాగే మనల్ని కూడా ఒక మిత్రపక్షంగా చూడడం ప్రారంభించింది. ఆసియాలోని అమెరికా భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మనం వ్యవహరించడం ద్వారా మనం ఎదుర్కొనే ముప్పుల్లో ఇదొకటిగా వుంటుంది. భారత్, క్వాడ్‌లో సభ్య దేశంగా మారింది. క్వాడ్ భద్రతాపరమైన కూటమిగా మారితే, బహుళ ధృవ ప్రపంచంలో భారత్ సామర్థ్యం లేదా అవకాశాలు కుదించుకుపోతాయి.

అలీనంగా వుండేందుకు భారతదేశం చేస్తున్న ప్రయత్నాలు అమెరికా సామ్రాజ్యవాద ఎజెండాను సవాలు చేయడంలో బ్రిక్స్, ఇతర గ్రూపుల పాత్రను ప్రభావితం చేస్తాయా ?

ప్రకాశ్ కరత్ : ఎస్‌సిఓ మనకు బాగా ఉపయోగపడే ప్రాంతీయ సంస్థ కాదన్న విషయాన్ని అంగీకరిస్తా. అయితే, పాకిస్తాన్ కారణంగా మనం దాన్నుండి వైదొలగలేం. బ్రిక్స్ దేశాల్లో చాలా దేశాలకు అన్ని అంశాల్లో ఉమ్మడి ప్రయోజనాలు లేవనేది వాస్తవమే అయినప్పటికీ ఒక సమిష్టి వేదికగా ఏర్పడేందుకు, వారి ప్రయోజనాలను వ్యక్తపరుచుకునేందుకు గ్లోబల్ సౌత్ దేశాలకు కచ్చితంగా అవకాశం వుందని బ్రిక్స్ రుజువు చేస్తోంది. బ్రిక్స్‌లో మనం భాగంగా వున్నపుడు, బ్రిక్స్‌లో దేశం దురాక్రమణకు గురైతే, మనం కనీసం ఒక వైఖరి తీసుకుని, 'మేం దీనికి వ్యతిరేకం' అంటూ 'నో' చెప్పాలి. మేం తటస్థమని చెప్పలేం. ఈ ఫోరమ్‌లు గ్లోబల్ సౌత్ దేశాల కనీస ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేలా చేయాలని మనం నిజంగా కోరుకున్నట్లైతే ప్రాదేశిక సార్వభౌమాధికారంపై జరిగే దాడులపైనైనా కనీసం ఒక వైఖరి తీసుకోవాల్సి వుంటుంది. అగ్ర రాజ్యాల్లో ఒకదానితో మనం వ్యూహాత్మక పొత్తు పెట్టుకున్నపుడు గ్లోబల్ సౌత్ ప్రతినిధిగా వున్నామన్న మన వాదన పూర్తిగా దెబ్బతింటుంది. అమెరికాతో భారత్ వ్యూహాత్మక సంబంధాలు బహుళ ధృవ ప్రపంచంలో మనకు గల మహత్తర అవకాశాలకు, మనం పోషించే పాత్రకు అడ్డంకిగా మారుతుంది.

భవిష్యత్తులో గ్లోబల్ సౌత్ ఎలాంటి పాత్ర పోషిస్తుంది, ముఖ్యంగా ట్రంప్ ఎజెండాకు సంబంధించి ?

ప్రకాశ్ కరత్ : ట్రంప్ ప్రారంభిస్తున్నది ప్రతీకార సుంకాలా లేదా వాణిజ్య యుద్ధమా అన్నదానితో నిమిత్తం లేకుండా గ్లోబల్ సౌత్ దేశాలే నిజమైన బాధితులు కానున్నాయి. వీటిల్లో చాలా దేశాలు నిజంగా తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. వాటి ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా ఇబ్బంది పడనున్నాయి. ఉద్యోగాలు కోల్పోవడం, తీవ్రమైన ఆర్థిక సమస్యలు తలెత్తనున్నాయి. రాబోయే రోజుల్లో, ప్రపంచ వర్ధమాన దేశాల (గ్లోబల్ సౌత్) ప్రతిఘటనా స్రవంతి కచ్చితంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాను. అందులో భారత్ భాగం కావాలి. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పెచ్చరిల్లే రుణాల సంక్షోభం, వాణిజ్య అసమానతలు, లేదా వాతావరణ మార్పులు ఇలా ఏదైనా కానివ్వండి, గ్లోబల్ సౌత్ దేశాల ప్రతిఘటనా స్రవంతిలో భాగమయ్యేందుకు స్పష్టమైన వ్యూహరచనపై భారత్ కసరత్తు చేయాలి.

జట్టు కట్టిన థాకరే సోదరులు

- రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపైకి
- ఇక నుంచి అన్ని ఎన్నికల్లో ఉమ్మడిగా బరిలోకి
- ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే వెల్లడి



ముంబయిలో జరిగిన సభలో కుటుంబ సమేతంగా పాల్గొన్న రాజ్ థాకరే, ఉద్ధవ్ థాకరే

ముంబయి : మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బిజెపి అప్రజాస్వామిక ఎత్తుగడల కారణంగా రెండు దశాబ్దాల కిందట వేరు కుంపట్లు పెట్టిన థాకరే సోదరులు మళ్లీ జట్టు కట్టారు. 2005లో విడిపోయిన అన్నదమ్ములు శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) అధినేత రాజ్ థాకరే ఒకే వేదిక పంచుకున్నారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో ఇది ప్రతిపక్షాల విజయంగా పేర్కొంటూ.. శనివారం ముంబయి వేదికగా 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తొలుత ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి సోదరులు ఇరువురు నివాళులర్పించారు. అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనా, రాష్ట్రంలోని దాని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంపైనా నిప్పులు చెరిగారు. బిజెపి అప్రజాస్వామిక ఎత్తుగడల కారణంగానే తాము విడిపోయామని, ఇప్పుడు మళ్లీ ఒక్కటయ్యామని, ఇక ఒక్కటిగానే ఉంటామని ప్రకటించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఆ తర్వాత జరిగే అన్ని ఎన్నికల్లోనూ కలిసే బరిలోకి దిగుతామని పేర్కొన్నారు.

హిందీని బలవంతంగా రుద్దితే సహించం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల్లో హిందీని బలవతంగా రుద్దాలని ప్రయత్నిస్తే సహించే ప్రసక్తే లేదని రాజ్‌థాకరే తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ద్వారా మన పిల్లలు సరైన విషయాలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతుందంటూ మోడీ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎందరో సినీనటులు, రాజకీయ నాయకులు ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం వంటి భాషల విషయంలో ఎంతో గర్వంగా ఉంటారన్నారు. అలాగే మహారాష్ట్ర నేతలకు, ప్రజలకు కూడా తమ భాషపై అభిమానం ఉంటుందని పేర్కొన్నారు. తమకు హిందీ భాషపై వ్యతిరేకత ఎప్పుడూ లేదన్నారు. అయితే ఇతరులపై ఆ భాషను బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ పూర్వీకులు మరాఠా సామ్రాజ్యాన్ని ఎన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ ఎప్పుడూ అక్కడి వారిపై మరాఠీని బలవంతంగా రుద్దలేదని ఆయన గుర్తు చేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇతర రాష్ట్రాలపై త్రిభాషా సూత్రాన్ని ప్రయోగించాలని ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. ఇప్పటికీ దేశంలోని సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టుల్లో అన్ని ఉత్తర్వులు ఆంగ్లభాషలోనే ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాలపై త్రిభాషా విధానం పేరుతో హిందీని బలవంతంగా రుద్దాలని చూస్తే.. ఏం జరుగుతుందో ఇప్పటికైనా కేంద్రం తెలుసుకోవాలని హెచ్చరించారు. తమను ఒకచోట చేర్చడం ఎవరికీ సాధ్యం కాలేదని.. చివరికి బాల్ థాకరే సైతం చేయలేకపోయిన పనిని.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా చేశారని రాజ్ థాకరే అన్నారు. అనుకోకుండానే ఆయన తమను ఒకే వేదిక పైకి తీసుకువచ్చారని అన్నారు. ఇకపై రాష్ట్ర ఐక్యత విషయంలో తాము ఎప్పటికీ ఒక్కటిగా ఉంటామని పేర్కొన్నారు.

అమర్‌నాథ్ యాత్రలో ప్రమాదం

- 36 మందికి గాయాలు

న్యూఢిల్లీ : అమర్‌నాథ్ యాత్రలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. జమ్ముకాశ్మీర్‌లోని రాంబన్ జిల్లా చందర్‌కోట్ వద్ద పహల్గాం బేస్ క్యాంప్‌నకు వెళ్తుండగా శనివారం నాడు చోటుచేసుకున్న ప్రమాదంలో 36 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను రాంబన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న బస్సులు వరుసగా ఒకదానినొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. యాత్రికులు అల్పాహారం చేయడం కోసం చందర్‌కోట్ వద్ద వాహనాలు నిలిపి ఉంచారు. అప్పుడే ఒక బస్సు నియంత్రణ కోల్పోయి, ఆగి ఉన్న వాటిని ఢీకొట్టింది. దాంతో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో యాత్రికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగినప్పటికీ బాధితుల్లో ఎక్కువ మంది యాత్రను కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని రాంబన్ పోలీసు ఉన్నతాధికారి కుల్బీర్‌సింగ్ వెల్లడించారు. అయితే కొందరికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు ఆగిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇక దెబ్బతిన్న బస్సులను మార్చడంతో యాత్ర ప్రారంభమైనట్లు చెప్పారు. జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. కట్టుదిట్టమైన భద్రత మధ్య 5,880 మందికి పైగా యాత్రికులు తొలి బ్యాచ్ బుధవారం జమ్ము నుంచి బయల్దేరింది. సాధారణంగా యాత్రికులు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ రెండు మార్గాలను ఇప్పటికే 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి భద్రతను మరింత పటిష్టం చేసినట్లు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు.

'సింహాచలం'లో మళ్లీ నిర్లక్ష్యం

- కూలిన రేకుల షెడ్డు
- యాత్రికులకు తప్పిన ముప్పు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని సింహగిరి వరుస ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవంలో నాసిరకం గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటన మరువకముందే కొండ కింద తొలి పావంచా వద్ద గిరిప్రదక్షిణ ఏర్పాట్లలో భాగంగా వేస్తున్న రేకుల షెడ్డు శనివారం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ జనం లేకపోవడంతో పెద్ద ముప్పే తప్పింది. తాజా ఘటనపై జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 9, 10 తేదీల్లో జరగబోయే సింహాచల గిరిప్రదక్షిణ ఏర్పాట్లలో కొండపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ త్రినాథరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎత్తుగా షెడ్లు వేయడానికి మనుషులైతే ఇబ్బంది అవుతుందని భావించి ప్రొక్లయినర్ వాడామని, అది స్తంభానికి తగిలి షెడ్ ఒరిగిపోయిందని తెలిపారు. విషయాన్ని కలెక్టర్‌కు తెలపగా పూర్తిగా షెడ్లను తొలగించి ఓపెన్‌గా ఉంచి క్రషర్ డస్ట్ వేయాలని సూచించారు.



సింహ గిరి తొలిపావంచా వద్ద కూలిన షెడ్డు

గతం నుంచి ఏం గుణపాఠం నేర్చుకున్నారు?

నాసిరకంగా పనులు జరిగాయని, అందువల్లే గోడకూలి అప్పట్లో ఏడుగురు యాత్రికులు చనిపోయారని ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి త్రిసభ్య కమిటీ నివేదించింది. నాడు సమయం ఇవ్వకుండా రూ.లక్షలకు కక్కుర్తిపడి కాంట్రాక్టరుతో హుటాహుటిన గోడ నిర్మాణం చేపట్టడంతో నాణ్యతలేక అది కూలిపోయినట్టు తేలిందని, అయినా, ప్రభుత్వం, అధికారుల తీరులో మార్పు రాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిప్రదక్షిణ కోసం వచ్చే లక్షల మంది యాత్రికుల కోసం నిర్మిస్తోన్న షెడ్ల విషయంలో ప్రమాణాలు పాటించకపోవడమే దీనికి నిదర్శనమని అంటున్నారు.

ట్రంప్ సుంకాలకు మోడీ తలొగ్గుతారు : రాహుల్

న్యూఢిల్లీ : అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ సుంకాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తలొగ్గుతారని, తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని రాహుల్ వ్యాఖ్యానించారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ట విధానాలను కలిగి ఉందని తెలిపారు. అయితే గోయల్ వ్యాఖ్యలను రాహుల్ కొట్టిపారేశారు.

దలైలామాకూ జీవితంపై చిగురించిన కోరిక

- మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆకాంక్ష

న్యూఢిల్లీ : టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామాకు జీవితంపై మమకారం పెరిగింది. ప్రస్తుతం 90వ పడిలో ఉన్న ఆయనకు మరో 30-40 ఏళ్ల జీవించాలని ఉందట! ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. సర్వ సమస్యలకూ కోరికలే మూలం అని భావించే బౌద్ధమత అత్యున్నత గురువు నోటివెంట జీవితంపై ఇలాంటి కోరికలు చిగురించడం గమనార్హం. దలైలామాకు 90 సంవత్సరాలు నిండినందున ఆయన స్థానంలో కొత్త వారసుడు 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన తన కోరికను వెలిబుచ్చారు. ఈ నెల 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులో భాగంగా దలైలామా మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30-40 ఏళ్ల జీవించాలని ఉందంటూ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ.. తాను 110 ఏళ్ల జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే.

బహుళపక్ష వాదాన్ని పెంపొందిద్దాం

- చైనా, ఫ్రాన్స్ నిర్ణయం

పారిస్ : బహుళపక్షవాదాన్ని సంయుక్తంగా పెంపొందించేందుకు, గుత్తాధిపత్య ఘర్షణలు, కూటమి ఘర్షణలకు వ్యతిరేకంగా సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని చైనా, ఫ్రాన్స్‌లు ప్రతిన చేశాయి. శుక్రవారం నాడు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో సమావేశమయ్యారు. బహుళపక్షవాదాన్ని ముందుకు తీసుకెళ్ళడం, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి వుండడం సహా అనేక కీలకమైన అంశాలపై ఫ్రాన్స్, చైనాల మధ్య స్థూల ఏకాభిప్రాయం నెలకొందని మాక్రాన్ పేర్కొన్నారు. అనిశ్చితి, ఎప్పుడేం జరుగుతుందో తెలియని అసందిగ్ధత పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో నేడు ప్రపంచం అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నదని, అందువల్ల ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలుగా చైనా, ఫ్రాన్స్‌లపై మరింత బాధ్యత వుందని మాక్రాన్ పేర్కొన్నారు.

అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య, పాలనాపరమైన అంశాలపై చైనాతో విధానపరమైన సమన్వయాన్ని బలోపేతం చేసుకోవాలని ఫ్రాన్స్ భావిస్తోందని చెప్పారు. అంతర్జాతీయ సవాళ్ళను సంయుక్తంగా పరిష్కరించడం, బహుళపక్షవాదంలోకి మరింత ప్రాముఖ్యతను చొప్పించడం, గుత్తాధిపత్యం, కూటమి ఘర్షణల్లోకి ప్రపంచం పడిపోకుండా నివారించడం వంటి చర్యలు చేపట్టాలని అన్నారు.



పారిస్‌లో జరిగిన సమావేశంలో ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారెట్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి

ఇరుదేశాల అధినేతలు అంగీకారానికి వచ్చిన ముఖ్యమైన అంశాలపై ఏకాభిప్రాయాలను అమలు చేసేందుకై ఫ్రాన్స్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సుముఖంగా వుందని వాంగ్ చెప్పారు. అన్ని రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు, తదుపరి దశలో ఉన్నత స్థాయిలో పరస్పర మార్పిడులకు చైనా సన్నద్ధంగా వుందన్నారు. అంతర్జాతీయంగా పరిస్థితులు మరింత అల్లకల్లోలంగా మారుతున్నపుడు చైనా-ఫ్రాన్స్ సంబంధాల వ్యూహాత్మక విలువ మరింత పెరుగుతుందన్నారు. బహుళపక్షవాదంలో చైనాకు ధృఢమైన విశ్వాసం వుందన్నారు. ఏకపక్ష బెదిరింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, బహుళపక్షవాదాన్ని సంయుక్తంగా పెంపొందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఫ్రీ హోల్డ్ భూములపై ఇచ్చిన ఆదేశాలతో పేదలకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కలిగిన పేదల మధ్య లావాదేవీలు జరిగితే కొనుగోలు చేసిన ఆ పేదలకే క్రమబద్ధీకరించాలని, ఆ పైన కొన్నవారి భూములను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి తిరిగి పేదలకు స్వాధీనం చేయాలని కోరారు. లక్షలాది మంది సన్న, చిన్నకారు రైతుల జిరాయితీ భూములు 22ఎ జాబితాలో ఉండడం వల్ల ఎటువంటి అమ్మకాలు, కొనుగోలు హక్కులు లేక, ప్రభుత్వ సబ్సిడీలు లేక అనేక అవస్థలు పడుతున్నారని, ఈ భూములను తక్షణమే విముక్తి చేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించినా నేటికీ ఆచరణ రూపం దాల్చలేదని పేర్కొన్నారు. అన్ని రకాల రికార్డులు, హక్కులు కలిగి ఉన్న రైతుల భూములను చుక్కల జాబితా నుండి తొలగించి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు.

నాలా రద్దును ఉపసంహరించాలి

నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్ట్ వ్యవసాయ యోగ్యమైన భూమిని వ్యవసాయేతర అవసరాలకు మళ్లించాలంటే నాలా చట్టం అడ్డు వస్తోందని చెబుతూ, కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు వ్యవసాయ భూములను అడ్డంగా దోచిపెట్టడానికే నాలాను రద్దు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిందని విమర్శించారు. ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అర్హులైన జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను బహిరంగపరచాలి వ్యవసాయ కార్మిక సంఘం

నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో బహిరంగపరచాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22(ఎ) జాబితాలో ఉన్న సన్న, చిన్నకారు రైతుల జిరాయితీ భూములను తక్షణమే నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు.

సంపన్నులకు ట్రంప్ నజరానా

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపులు తగ్గింపుపై నోరు మెదపలేదు. ప్రధానంగా మెడికెయిడ్‌లో తీవ్ర కోతల గురించి ఆయన అస్సలు ప్రస్తావించలేదు. ఈ కోతలతో నష్టపోయేది నిరుపేదలైన అమెరికన్లే. దాదాపు లక్ష కోట్ల డాలర్ల మేరకు మెడికెయిడ్ నిధుల్లో కోత పడనుంది. దీనికి తోడు నిరుపేదలకు అందే ఆహార సాయంలో, ఇతరత్రా ప్రభుత్వ లబ్దిలో కూడా కోత పడనుంది. 2034కల్లా ఎలాంటి ఆరోగ్య బీమా లేకుండా దాదాపు కోటీ 18 లక్షల మందికి పైగా ప్రజలు నిస్సహాయులవుతారని అంచనా వేశారు. ఈ ఏడాది ప్రారంభంలో ఈ పథకంలో కోతలు విధించనని హామీ ఇచ్చిన ట్రంప్ దాన్ని ఉల్లంఘించారు. పైగా ఈ చట్టం వల్ల దేశ రుణ భారం లక్షల కోట్ల డాలర్ల మేరా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

7 గ్రామాల్లో 20,496 ఎకరాలు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం కల్పించారు. అనంతరం భూముల సరిహద్దులు, విస్తీర్ణాన్ని సర్వే చేస్తారు.

- రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆమోదించిన అనంతరం ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు గతంలో మాదిరి కాకుండా వన్‌టైం పాస్‌వర్డును వినియోగించనున్నారు.
- 2025 పూలింగు చట్టంలో సెక్షన్లు 44, 53కి అనుగుణంగా అభివృద్ధి అవసరాలకు 50 శాతం భూమిని కేటాయించారు. దీనిలో పార్కులు, ఆటస్థలాలు, తోటలకు, ఓపెన్‌స్పేస్‌కు 10 శాతం, రోడ్లు, యుటిలిటీ సేవలకు 30 శాతం, సామాజిక సదుపాయాలకు ఐదుశాతం, గృహాలకు ఐదుశాతం కేటాయించనున్నారు.
- సెక్షన్ 57(2) ప్రకారం తుది నోటిఫికేషన్ జారీచేసిన అనంతరం భూమి సిఆర్‌డిఎ పరమవుతుంది.
- సెక్షన్ 57(3) ప్రకారం రైతులకు ల్యాండ్ పూలింగు ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. దీనికి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఈ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ పద్ధతిలోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదే అసలు ధ్రువపత్రంగా గుర్తిస్తారు.
- పూలింగు ఏరియాలో జాయింట్ కలెక్టర్ నిర్ధారించిన అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములపై అభ్యంతరాలను 15 రోజుల్లో తెలపాల్సి ఉంటుంది.

6 నెలల్లో మూడో నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే తుది నోటిఫికేషన్ అవుతుంది.



అర్జెంటీనా అధ్యక్షులు జేవియర్ మిలేతో సమావేశమైన ప్రధాని నరేంద్ర మోడీ

కీలక రంగాల్లో సహకారంపై చర్చలు

- అర్జెంటీనా అధ్యక్షుడితో మోడీ భేటీ

బ్యూనస్ ఎయిర్స్ : ఐదు దేశాల పర్యటనలో భాగంగా మూడో దేశమైన అర్జెంటీనాలో ప్రస్తుతం ప్రధాని మోడీ పర్యటిస్తున్నారు. శనివారం అర్జెంటీనా అధ్యక్షుడు మిలెతో విస్తృతాంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్,చమురు, గ్యాస్, పునర్వినియోగ ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడుల రంగాలతో సహా కీలకమైన రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అర్జెంటీనా జాతిపితగా భావించే జోస్ డి సాన్ మార్టిన్‌కు ప్రధాని ఘనంగా నివాళి అర్పించారు. ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా గత 57ఏళ్ళ కాలంలో అర్జెంటీనాలో పర్యటించిన తొలి ప్రధాని మోడీనే. జి 20 సదస్సు కోసం 2018లో మోడీ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ నుండి బ్రెజిల్ వెళ్ళనున్నారు. అక్కడ జరిగే 17వ బ్రిక్స్ సదస్సుకు హాజరవుతారు. ఇక చివరగా నమీబియాలో పర్యటిస్తారు.

గోదావరికి వరద ఉధృతి

(మొదటి పేజీ తరువాయి)

48 గంటల సమయం పట్టనుంది. ఎగువన కురుస్తున్న వర్షాలు, కాళేశ్వరం జలాల కారణంగా వరద ఉధతి మరో రెండు, మూడు రోజులపాటు కొనసాగుతుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల మూడో తేదీ ఉదయం 96,500 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో నాలుగో తేదీకి 1,48,915 క్యూసెక్కులకు పెరిగింది. శనివారం ఉదయం ఆరు గంటలకు సీలేరు నీటితో కలిపి 1,70,9 29 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ జి.శ్రీనివాస్ తెలిపారు. దీనిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు 12,100 సాగునీటి అవసరాలకు విడిచిపెడుతున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం ఆనకట్ట నుంచి 1.80 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెడుతున్నట్టు తెలిపారు.

పోలవరం స్పిల్‌వే నుండి 1,87,051 క్యూసెక్కులు దిగువకు

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.920 మీటర్లు, దిగువన 18.470 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువన 28.050 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్‌కు దిగువన 17,300 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.040 మీటర్లు నీటిమట్టం, ప్రాజెక్టు దిగువన 16.49 మీటర్ల నీటిమట్టం నమోదైందని, వరద క్రమంగా పెరుగుతోందని సిడబ్ల్యుసి అధికారులు చెప్పారు. స్పిల్‌వే నుండి 1,87,051 క్యూసెక్కుల అదనపు జలాలను దిగువకు విడుదల చేసినట్టు తెలిపారు.



ఆరుగురు స్నేహితులు



ఒక పాఠశాలలో సురేష్, రవి, రాము, హర్ష రాకేష్, సిద్ధు అనే ఆరుగురు స్నేహితులు ఉన్నారు. వారు పదవ తరగతి చదువుతున్నారు. వారిలో ఇద్దరు బాగా చదువుతారు, మరో ఇద్దరు ఎప్పుడూ సంతోషంగా అందరినీ నవ్విస్తుంటారు. వారికి చదువు అంతగా వచ్చేది కాదు. ఇంకొక ఇద్దరు ఆటల్లో ఆరితేరిన వారు. వీరికి చదువు మీద అసలు ఆసక్తి ఉండేది కాదు. ఉపాధ్యాయులు అందరూ ఆరుగురు స్నేహితుల్లో ఆటలు బాగా ఆడే ఇద్దరినీ ఎప్పుడూ తిడుతూ ఉండే వారు. ఒకసారి ఆటల్లో మునిగిపోయిన ఆ ఇద్దరు స్నేహితులు పరీక్షలకు బాగా చదవలేదు. పరీక్ష రాస్తే కచ్చితంగా ఫెయిల్ అవుతామని భయపడ్డారు. అప్పుడు బాగా చదివే ఇద్దరు స్నేహితులు మొత్తం నలుగురు స్నేహితులని తమతో కూర్చోబెట్టుకుని చదివించారు. అర్థం కాని విషయాలు చెప్పారు. ఇంటికి తీసుకెళ్లి అదనపు సమయం వెచ్చించారు. పరీక్షలు రానే వచ్చాయి. అందరూ పరీక్షలు రాశారు.



ఆరుగురు స్నేహితులు ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. ఫలితాలు చూసి ఉపాధ్యాయులు చాలా ఆశ్చర్య పోయారు. 'మీకు ఇన్ని మంచి మార్కులు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందిరా! మొదట నుండీ ఇలాగే చదివితే తిట్లు తప్పేవి కదారా!' అని అన్నారు. అప్పుడు తమ చదువు కోసం ఇద్దరు స్నేహితులు చేసిన సాయం చెప్పారు. ఉపాధ్యాయులు వాళ్లని ఎంతో అభినందించారు. 'ఎప్పుడూ మీరు ఇలా ఒకరినొకరు సహాయం చేసుకుంటూ కలిసికట్టుగా ఉండి జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోండి' అని ఆరుగురు స్నేహితులను ఆశీర్వదించారు. స్నేహితులంటే వీరిలాగా ఉండాలని మిగతా పిల్లలందరికీ చెప్పారు.

- టి. పార్థు సాయి 8వ తరగతి, అరవింద హైస్కూలు, కుంచనపల్లి.

అదే జీవితమంటే!



జీవితంలో మిఠాయి లాంటి సంతోషమైన సంఘటనలు ఉంటాయి. వాటిని ఆస్వాదించాలి!

జీవితంలో కంగారుపెట్టే కఠినమైన కష్టాలు ఎన్నో ఉంటాయి. వాటిని ధైర్యంతో ఎదిరించాలి!

జీవితంలో కాకరకాయ వంటి చేదుగా ఉండే బాధలు ఉంటాయి. వాటిని తట్టుకొని నిలబడాలి!

జీవితంలో మధురమైన అమ్మానాన్న ప్రేమ, స్నేహితుల ప్రేమ ఉంటుంది. దాన్ని స్వీకరించాలి!

జీవితంలో బాల్యం అనే అందమైన కాలం ఉంటుంది. దాన్ని సంతోషంగా గడపాలి!

జీవితంలో గురువు జ్ఞానం రూపంలో మన ఎదురుగా ఉంటారు. వాళ్ళు ఇచ్చే జ్ఞానం ఎప్పుడూ వదులుకోకూడదు!



మొత్తంగా జీవితం ఒక మిశ్రమం లాంటిది. దానిలో సంతోషం, కష్టం, బాధ, ప్రేమ, స్నేహం మరెన్నో ఉంటాయి. వాటన్నిటిని అనుభవించాలి, ఆస్వాదించాలి. అదే జీవితం అంటే!

- ఆర్.కుందనిక, 8వ తరగతి, అరవింద హై స్కూలు, కుంచనపల్లి

నేను గీసిన బొమ్మ



గుంజా శ్యామ్ అశ్విన్,
2వ తరగతి,
మోడల్ ప్రైమరీ స్కూలు, చిల్లకల్లు,
జగ్గయ్యపేట మండలం
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

ప్రవర్తన అద్దం లాంటిది. ప్రతి వ్యక్తి ప్రతిబింబం దానిలో కనిపిస్తుంది.

మీ కోసం

బాగా మంటగా ఉన్న పచ్చి మిరపకాయలను ఫ్రిజ్ నుంచి తీసి చల్లటి నీటిలో కాసేపు ఉంచితే కారం తగ్గుతుంది.



JEEVANA జీవన the family

విచారణ లేని ఖైదీలు.. విచారంలో ఆప్తులు..

'నువ్వు వెళ్లి బాబు చాలా మంచి వాడని జడ్జికి చెప్పు. న్యాయవాదితో ఈ విషయం గట్టిగా వాదించమని చెప్పు. బాబు ఏ నేరం చేయలేదని, అతన్ని బయటికి పంపమని చెప్పు. జైలు బయట అతని తల్లి వేచి చూస్తోందని కూడా చెప్పమను' అని 70 ఏళ్ల తల్లి తన కోడలిని వేడుకుని ఐదేళ్లు గడిచిపోయాయి. అయినా బాబు విడుదల కాలేదు. అసలు కోర్టులో అతని కేసు విచారణ కూడా జరగలేదు. జస్టిస్ ఇండియా నివేదిక 2025 ప్రకారం జైలు జనాభాలో 76 శాతం మంది ఖైదీలు విచారణ పూర్తికానివారే ఉన్నారు.



ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ హనీబాబుని భీమా కోరేగావ్ కేసులో 'ఉగ్రవాద నిరోధక చట్టం' కింద 2020 జులై 28న అరెస్టు చేశారు. వాస్తవానికి ఈ కేసులో 2018లోనే అరెస్టులు జరిగాయి. అయితే అభియోగం మోపబడిన ఆ వ్యక్తులు నిర్దోషులని, వారికి ఉగ్రవాదులతో ఎటువంటి సంబంధాలు లేవని నిరూపించేందుకు కొన్ని కమిటీలు ఏర్పడ్డాయి. అలా ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబుకి మద్దతుగా ఏర్పడ్డ కమిటీలో బాబు ఒక సభ్యుడు.

నిర్దోషులకి మద్దతుగా నిలబడడమే బాబు చేసిన నేరం. అదే అతన్ని జైలు పాలు చేసింది. నిరసనలు చేయడం, నిర్దోషుల పక్షాన నిలబడిన వారిపై దేశద్రోహం కేసులు పెట్టడం ఇప్పుడు పరిపాటి అయ్యింది. బాబుతో పాటు ఎంతోమంది న్యాయవాదులు, కార్యకర్తలు, ప్రొఫెసర్లను, సామాన్య జనాభాని కూడా కటకటాల పాల్జేస్తున్న పాలకులు ఇప్పుడు దేశాన్ని ఏలుతున్నారు. 1970ల నాటి ప్రకటిత ఎమర్జెన్సీకి ఏమాత్రం తీసిపోకుండా నిరాటంకంగా సాగిపోతున్న ఈ అప్రకటిత ఎమర్జెన్సీకి ఇంతకంటే మించిన ఉదాహరణ మరొకటి ఉండదు.



57 ఏళ్ల బాబు అరెస్టయ్యే నాటికి దేశంలో కోవిడ్ విజృంభించింది. ఇరుకైన జైలు గదులు అతని ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. బాబుకి పలుమార్లు కోవిడ్ సోకింది. కంటికి ఇన్‌ఫెక్షన్ అయ్యింది. అతను జైలుకి వచ్చేనాటికి కూతురుకి 17 ఏళ్లు. 'తండ్రి ఎందుకు అరెస్టు అయ్యాడో తెలియని అయోమయంలో తను వారం రోజులు ఇంట్లో నుండి బయటకి రాలేద'ని బాబు భార్య రొవేనీ చెబుతున్నప్పుడు ఆమె కళ్లు నీళ్లతో నిండిఉన్నాయి.

ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ అయిన రొవేనీ బాబు తల్లి గురించి ఇలా చెప్పారు. 'బాబుని తీసుకురండి.. అని ఆమె మొదట్లో ఎంతో అభ్యర్థించేవారు. ఇప్పుడు అలా అడగకపోయినా, ఆమె కళ్లు ఎప్పుడూ ఇంటి ముందు గేటు వైపే చూస్తూ ఉంటాయి. వారమంతా బాబు నుండి వచ్చే ఫోన్ కాల్ కోసం ఎదురుచూడడమే ఆమె దినచర్యగా మారిపోయింది' అని చెప్పారు.

జస్టిస్ ఇండియా రిపోర్ట్ 2025 ప్రకారం.. భారత జైళ్లలో మూడొంతుల మందికి పైగా ఇంకా ఏ నేరానికి పాల్పడినట్లు నిర్ధారించబడలేదు. ఈ నిష్పత్తి జైలు జనాభాలో 76 శాతం. విచారణలో ఉన్న ఖైదీల సంఖ్య 2012లో 66 శాతం ఉంది. 2022లో 76 శాతానికి పెరిగిందని నివేదిక పేర్కొంది.

అరెస్టు తరువాత బాబుని చూసేందుకు రొవేనా, తన కూతురు తరచూ ఢిల్లీ నుండి ముంబయికి ప్రయాణం చేస్తున్నారు. కోర్టులో కాని, జైలులో గాని అతన్ని కలుస్తున్నారు. రొవేనా కూతురు ప్రస్తుతం జర్నలిజంలో డిగ్రీ పూర్తిచేశారు. 'బాబుని చూసేందుకు వెళ్తున్నప్పుడు మనసు చాలా సంతోషంతో నిండిపోతుంది. కానీ తిరిగి వచ్చేటప్పుడు గుండెలనిండా బాధ కమ్మేస్తుంది' అని రొవేనా మాట్లాడుతున్నప్పుడు ఆ బాధ స్పష్టంగా కనిపించింది.

'బాబుని ఇంకా జైల్లో ఎందుకు ఉంచారో అర్థం కావడం లేదని' ఆవేదన చెందుతున్న రొవేనా అతనితో పాటు అరెస్టయిన వ్యక్తుల గురించి కూడా కలవరపడుతున్నారు. 'వీళ్లు నిర్దోషులని.. వాళ్లకి తెలుసు.. విచారణ లేకుండా జైల్లో ఉంచడమే వీళ్లకి విధించిన శిక్ష. ఎందుకంటే విచారణలో కేసు నిలబడదు' అని ఆమె ఆవేశం నిండిన గొంతుతో అన్నారు.

ప్రభుత్వ నివేదిక ప్రకారం 2014 నుండి 2022 వరకు 'ఉపా' కింద 8719 కేసులు నమోదుచేశారు. 215 కేసుల్లోనే నేరం రుజువైంది. 567 కేసుల్లో నిర్దోషులని తేలింది. మిగతా వారంతా విచారణ లేకుండా ఇంకా జైళ్లల్లోనే మగ్గుతున్నారు. వీరిలో చాలామంది అనారోగ్యాలతో అక్కడే మరణిస్తున్నారు. స్టాన్ స్వామి మరణం అలాంటిదే. 90 శాతం వైకల్యంతో బాధపడుతున్న సాయిబాబా కూడా విడుదలైన కొన్నిరోజులకే అనారోగ్య కారణాలతో మరణించారు. ఈ కేసులోనే అరెస్టయిన 33 ఏళ్ల వ్యవసాయ కార్మికుడు పాండు కూడా స్వైన్‌ఫ్లూతో జైల్లోనే కన్నుమూశాడు. ఇలాంటి వారి సంఖ్య ఇంకా పెద్దదే ఉంటుంది. కానీ బయటికి రావడం లేదు.

ఈ కేసులో అరెస్టయిన మహేష్ రౌత్ విషయంలో కూడా రొవేనా ఎంతో బాధపడుతున్నారు. 'అతను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆహారం కూడా తీసుకోలేకపోతున్నాడు. ఎంతో భవిష్యత్తు ఉన్న మహేష్ ఈ ఏడాదే న్యాయవాద పరీక్షలు కూడా రాశాడు. కానీ అతని పరిస్థితి చూస్తుంటే ప్రాణంతో బయటికి వస్తాడో రాడో తెలియడం లేదు. అతనికేమౌతుందో అని భయంగా ఉంది' అని చెప్పారు.

ఐదేళ్లుగా ఢిల్లీ, ముంబయికి ప్రయాణిస్తూ ప్రత్యక్షంగా ఖైదీలను చూస్తున్న రొవేనా ఇంకా చాలా విషయాలు మాట్లాడారు. 'జైల్లో మగ్గిపోతున్న ఎందరో జీవితాలు అక్కడే ముగిసిపోతున్నాయి. అనారోగ్యాలతో బాధపడుతున్న వారిని పట్టించుకోరు. వారిలో కొంతమంది బెయిల్ బాండ్స్‌కి డబ్బు చెల్లించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇంకొందరు వారి కోసం ఎవరూ రాని ఆదివాసీలు. ఎవరైనా మాలాంటి వారి కోసం వార్తలు రాయాలనుకుంటుంటే, వారి గురించి కూడా ప్రస్తావించండి' అని ఆమె కోరుతున్నారు.

శుభ్‌మన్ రికార్డు సెంచరీ

- రెండు ఇన్నింగ్స్‌లోనూ శతకాలు బాదిన మూడో భారత కెప్టెన్
- ఇండియా రెండో ఇన్నింగ్స్ 427/6డిక్లేర్డ్
- ఇంగ్లండ్ లక్ష్యం 608 పరుగులు ప్రస్తుతం 72/3



బర్మింగ్‌హామ్: టెస్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పలు రికార్డులను సమం చేస్తున్నాడు. తొలి టెస్ట్‌లో సెంచరీ, రెండో టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌లోనూ శతకాలతో ఈ ఫీట్‌లు అందుకున్నాడు. ఎడ్‌బాస్టన్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టిన మూడో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా ఈ ఫీట్ సాధించిన రెండో భారత సారథిగా శుభ్‌మన్ పలు రికార్డులు సమం చేశాడు. బర్మింగ్ హామ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో నాల్గోరోజు ఆటలో భాగంగా శుభ్‌మన్(161; 162బంతుల్లో 13ఫోర్లు, 8సిక్సర్లు) మెరిసాడు. మరోవైపు కెఎల్ రాహుల్, పంత్, జడేజా అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో భారతజట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6వికెట్ల నష్టానికి 427పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో కలిసి ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ముంగు 608పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది.

ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 64 పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారతజట్టును కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భారీ శతకంతో ఆదుకున్నారు. తొలి సెషన్‌లో కరణ్ నాయర్(26) నిరాశపరిచినా.. కెఎల్ రాహుల్-గిల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. లంచ్ తర్వాత రిషభ్ పంత్(61)తో సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన గిల్.. అనంతరం రవీంద్ర జడేజా(69నాటౌట్)తో 177 పరుగులు జోడించాడు. టీ సెషన్‌కు భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. టీ సెషన్ తర్వాత శుభ్‌మన్, జడేజా ధాటిగా బ్యాటింగ్ చేశారు. ఈ క్రమంలో కెప్టెన్ డబుల్ సెంచరీవైపు దూసుకెళ్తున్న దశలో ఇంగ్లండ్ స్పిన్నర్ బషీర్‌కు రివర్స్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆంధ్ర కుర్రాడు నితీశ్ రెడ్డి(1) మరోసారి నిరాశపరిచాడు. సుందర్(12నాటౌట్) క్రీజ్‌లో ఉన్న దశలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేస్తున్నట్లు గిల్ ప్రకటించాడు. ఇంగ్లండ్ బౌలర్లు బషీర్, టంగ్‌కు రెండేసి, కర్సే, రూట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు నాల్గోరోజు ఆట నిలిచే సమయానికి 3వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. క్రీజ్‌లో బ్రూక్(15), పోప్(24) ఉన్నారు.

రెండు ఇన్నింగ్స్‌లోనూ సెంచరీలు కొట్టిన భారత కెప్టెన్లు..

1. సునీల్ గవాస్కర్ (వెస్టిండీస్‌పై, కోల్‌కతా-1978)
2. విరాట్ కోహ్లి (ఆస్ట్రేలియాపై, అడిలైడ్-2014)
3. శుభ్‌మన్ గిల్ (ఇంగ్లండ్‌పై, ఎడ్జ్‌బాస్టన్-2025)

పలు రికార్డులు శుభ్‌మన్ ఖాతాలో...

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక టెస్ట్‌లో డబుల్ సెంచరీ, సెంచరీ కొట్టిన తొమ్మిదో కెప్టెన్‌గా శుభ్‌మన్ రికార్డుపుటల్లోకెక్కాడు. ఈ క్రమంలోనే భారత్‌నుంచి గవాస్కర్ తర్వాత ఈ ఫీట్ అందుకున్న రెండో బ్యాటర్ శుభ్‌మన్ నిలిచాడు. ఇక విరాట్ కోహ్లీ తర్వాత కెప్టెన్‌గా భారత్ తరఫున రెండు టెస్టుల్లో మూడు సెంచరీలు కొట్టిన రెండో బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. క్రికెట్ చరిత్రలో కెప్టెన్లుగా విజయ్ హజారే, జాకీ మెక్‌గ్లూ, గ్రెగ్ చాపెల్, సునీల్ గవాస్కర్, అలస్టైర్ కుక్, స్టీవెన్ స్మిత్ మరియు ధనంజయ డి-సిల్వా వరుసగా రెండు సెంచరీలు సాధించారు.

స్కోర్‌బోర్డు...

భారత్ తొలి ఇన్నింగ్స్ : 587
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 407

భారత్ రెండో ఇన్నింగ్స్ : జైస్వాల్ (ఎల్‌బి)టంగ్ 28, కెఎల్ రాహుల్ (సి)టంగ్ 55, కరణ్ నాయర్ (సి)స్మిత్ (బి)కర్సే 26, శుభ్‌మన్ (సి అండ్ బి)బషీర్ 161, పంత్ (సి)డకెట్ (బి)బషీర్ 65, జడేజా (నాటౌట్) 69, నితీశ్‌కుమార్ రెడ్డి (సి)క్రాలే (బి)రూట్ 1, సుందర్ (నాటౌట్) 12, అదనం 10. (83ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 427పరుగులు **వికెట్ల పతనం:** 1/51, 2/96, 3/126, 4/236, 5/411, 6/412 **బౌలింగ్:** వోక్స్ 14-3-61-0, కర్సే 12-2-56-1, టంగ్ 15-2-93-2, స్టోక్స్ 7-1-26-0, బషీర్ 26-1-119-2, రూట్ 9-1-65-1.

ప్రి క్వార్టర్స్‌కు సినర్, సబలెంక

యాస్ట్రిమెస్కా జోరుకు బ్రేక్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్




సబలెంక

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ జెన్నిక్ సినర్ ప్రవేశించారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో సబలెంక 7-6(8-5), 6-4తో బ్రిటన్‌కు చెందిన రాడుకాను, సిన్నర్ 6-1, 6-3, 6-1తో మార్టినేజ్(స్పెయిన్)ను చిత్తుచేశారు. తొలిసెట్‌ను టైబ్రేక్‌లో చేజిక్కించుకున్న సబలెంక.. రెండో సెట్‌ను ఒక బ్రేక్ పాయింట్ సాధించి కైవసం చేసుకుంది. ఉక్రెయిన్ స్టార్ యాస్ట్రిమెస్కా జోరుకు బ్రేక్ పడింది. తొలిరౌండ్‌లో 2వ సీడ్, అమెరికా సంచలనం కోకోగాఫ్‌ను ఓడించి మూడోరౌండ్‌కు చేరిన యాస్ట్రిమెస్కా.. శనివారం జరిగిన మూడోరౌండ్‌లో మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన పోరులో యాస్ట్రిమెస్కా 1-6, 6-2, 3-6తో అన్‌సీడెడ్ బౌంజాస్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. మరో పోటీలో 19వ సీడ్, రష్యాకు చెందిన సంసునోవా 6-2, 6-3తో 16వ సీడ్ కసట్కినా(ఆస్ట్రేలియా)పై విజయం సాధించి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. ఇక పురుషుల సింగిల్స్‌లో 22వ సీడ్ కోబల్లి(ఇటలీ), డిమిట్రోవ్, 2వ సీడ్ అల్కరాజ్(స్పెయిన్) ప్రవేశించారు. కోబల్లి 6-2, 6-4, 6-2తో 15వ సీడ్ మెన్సిక్(చెక్)ను చిత్తుచేయగా.. 19వ సీడ్ డిమిట్రోవ్ 6-3, 6-4, 7-6(7-0)తో అన్‌సీడెడ్, పోలండ్‌కు చెందిన ఆఫ్‌నెర్‌ను ఓడించాడు. ఇక అల్కరాజ్ 6-1, 3-6, 6-3, 6-4తో జర్మనీకి చెందిన స్టఫ్‌ను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరాడు. క్వార్టర్స్‌లో అల్కరాజ్ 14వ సీడ్, రష్యాకు చెందిన రుబ్లేవ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. టాప్‌సీడ్ సిన్నర్ 19వ సీడ్ డిమిట్రోవ్(బల్గేరియా)తో తలపడనున్నాడు.

బాలాజీ జంటకు నిరాశ..

వింబుల్డన్ డబుల్స్‌లో శ్రీరాం బాలాజీ జంట ఓటమిపాలైంది. శనివారం జరిగిన రెండోరౌండ్ పోటీలో శ్రీరాం బాలాజీ-రెయాస్(మెక్సికో) జంట 4-6, 4-6తో 4వ సీడ్, అర్జెంటీనా-స్పెయిన్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు.



సెమీస్‌కు కిదాంబి శ్రీకాంత్

కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఒట్టాంగ్(కెనడా): కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. కిదాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా.. సుబ్రమణియన్ క్వార్టర్‌ఫైనల్లో ఓటమిపాలయ్యాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్ 21-18, 21-9తో ఛౌ-టిన్-చెన్ (చైనీస్ ఐపీ)ని చిత్తుచేసి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఇక సుబ్రమణియన్ మూడుసెట్ల హోరాహోరీపోరులో తనకంటే మెరుగైన ర్యాంక్ ఆటగాడైన జపాన్‌కు చెందిన నిషిమోటో చేతిలో ఓటమిపాలయ్యాడు. హోరాహోరీగా సాగిన ఆ పోటీలో సుబ్రమణియన్ 15-21, 21-5, 17-21తో పరాజయాన్ని చవిచూశాడు. సెమీస్‌లో శ్రీకాంత్.. నిషిమోటోతో ఆడతాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68